

సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి రెండేళ్ల పాలనలో రూ.66 వేల కోట్ల పెన్షన్లు అందించాం. దేశంలోనే అత్యధికంగా పించన్‌ను రూ.4 వేలకు పెంచాం. సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నాం. వైసీపీకి సంక్షేమం అర్థం తెలుసా?

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 02.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 71 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# అభివృద్ధే... మా రాజకీయం

## సంక్షేమం, పెట్టుబడులు, ఉపాధిపై కూటమి ప్రభుత్వ ఫోకస్



- డ్వాక్రా మహిళలు దేశానికి ఆదర్శమని ప్రశంస
- నేర రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలి
- ప్రజాభీష్టం మేరకే పాలన కొనసాగిస్తున్నాం:సీఎం

**గూడూరు (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రాభివృద్ధితో పాటు తెలుగువారిని అందలం ఎక్కించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజాభీష్టం మేరకే సుపరిపాలన అందిస్తున్నామని వివరించారు. ప్రజల జీవితాల్లో శాశ్వతంగా వెలుగులు నింపే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం పున్నపువారిపాలెంలో బుధవారం పేదల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజా వేదిక సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... "ప్రజలు చూపిస్తూన్న అభిమానంతో పడుతున్న కష్టాన్ని మర్చిపోతున్నాం. మిగతా 3లో...



# శెహభాష్ ..లోకేష్



**విద్యాశాఖ మంత్రిగా లోకేష్ పనితీరుకు రాష్ట్రపతి ప్రశంసలు**

**విద్యాశాఖలో సంస్కరణలు కొనసాగించాలని సూచన**

**యువతలో స్ఫూర్తి నింపేలా లోకేష్ ప్రసంగించారని అభినందించిన రాష్ట్రపతి**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విద్యాశాఖ మంత్రిగా దేశానికే ఆదర్శంగా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం కృషి చేస్తూ, ఎన్నో సంస్కరణలు విజయవంతంగా అమలు చేస్తున్న నారా లోకేష్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. ఈ సంస్కరణలు కొనసాగాలని సూచించారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవానికి హాజరై తిరిగి వెళుతున్నప్పుడు రాష్ట్రపతికి వీడ్కోలు పలికేందుకు హెలికాప్టర్ వరకు మంత్రి లోకేష్ వెళ్లారు.

తన దగ్గరకు మంత్రిని పిలిచిన రాష్ట్రపతి.. ఏపీలో విద్యాసంస్కరణలు, విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులు చాలా బాగున్నాయని అభినందించారు. వీటిని కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు కేంద్రంగా సాగుతున్న విద్యా వ్యవస్థ మార్పులు వారికి బంగారు భవిష్యత్తుకు మార్గం వేస్తాయన్నారు. స్నాతకోత్సవంలో మంత్రి నారా లోకేష్ ప్రసంగం స్ఫూర్తివంతంగా సాగిందని రాష్ట్రపతి అభినందించారు. సభకు హాజరైన గ్రాడ్యుయేట్స్‌కు మంచి సందేశం ఇచ్చారని ప్రశంసించారు. .

### 'నో అడ్మిషన్' బోర్డులే లక్ష్యం

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ
- విద్యార్థుల ప్రతిభకు ఇంటి పట్టాలతో ప్రోత్సాహం

● వివరాలు 2 లో

### ఇంటింటికీ కూటమి పాలన

- కూటమి రెండేళ్ల పాలనపై విస్తృత ప్రచారం
- కేడర్‌కు దిశానిర్దేశం చేసిన లోకేశ్

● వివరాలు 2 లో

# రెండేళ్లలో 3 వేల మంది వైద్యులు



- వైద్యుల విధులకు ఆటంకం కలిగించొద్దు
- వారికిచ్చే గౌరవంతో రోగుల ప్రాణాలకు భరోసా
- జీరో వేకెన్సీ విధానం ద్వారా నిరంతరం పోస్టుల భర్తీ
- ఐఎంఏ సహకారానికి కృతజ్ఞతలు
- డాక్టర్స్ డే వేడుకల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**కడప(జర్నలిస్ట్ ఫైల్) :** సమాజంలో వైద్యులపట్ల గౌరవ భావం పెరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆరోగ్య పరిస్థితి ఆధారంగా చికిత్స అందించే వైద్యులకు ఆసుపత్రుల్లో తగిన వాతావరణం, భద్రత కల్పిస్తేనే రోగులు సత్వరం కోలుకుంటారని పేర్కొన్నారు. వైద్యులు అందించే ఉత్తమ వైద్య సేవలవల్ల రోగుల కుటుంబాలకు భరోసా లభిస్తోందని తెలిపారు. అటువంటి పవిత్ర వృత్తిలో ఉన్న వైద్యులకు గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని, అన్ని స్థాయిల్లోని వారందరూ ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని కోరుతున్నానని పేర్కొన్నారు.

ఇటీవల కాలంలో చోటు చేసుకుశీటుకున్న పలు సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. వైద్యులతో వాగ్వాదాలు , దూషణలు లకు దిగకుడా గౌరవాన్ని ప్రదర్శించాలని తెలిపారు. భగవంతుడు ప్రాణాలు ఇస్తుంటే.. వాటిని నిలుపుతున్న వైద్యులకు అభినందనలు తెలుపుతున్నానని చెప్పారు. వైద్యులు కూడా వృత్తిపట్ల నిబద్ధత పాటిస్తూ రోగులు, మిగతా 2లో...

## హజ్ యాత్రకు ప్రభుత్వ భరోసా



- రూ.3.31 కోట్లను డీబీటీ ద్వారా జమ
- 331 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ద్వారా పవిత్ర హజ్ యాత్రకు వెళ్లి విజయవంతంగా తిరిగి వచ్చిన 331 మంది యాత్రికుల బ్యాంకు ఖాతాల్లో రూ. 3. 31 కోట్ల ఆర్థిక సాయాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానంలో జమ చేసినట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. గన్నవరం విమానాశ్రయం నుంచి రెండు విడతల్లో హజ్ యాత్రకు వెళ్లిన ప్రతి యాత్రికుడికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించినట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. హజ్ యాత్ర విజయవంతంగా పూర్తయ్యేలా మైనారిటీ సంక్షేమ శాఖతో పాటు అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేశాయని, యాత్రికులంతా క్షేమంగా తిరిగి వచ్చారని తెలిపారు. మిగతా 2లో...



# ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం

- అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి: ఎమ్మెల్సీ ఆలపాటి
- ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం తెనాలి పట్టణంలోని 8, 9 వార్డుల్లో నిర్వహిస్తున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఆయన కోరారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఓటు హక్కు ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవచ్చని చెప్పారు. ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి ఓటు ప్రధాన సాధనమని పేర్కొన్నారు. కుటుంబంలో మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని, కొత్తగా ఓటు హక్కు పొందదలచిన వారు వెంటనే నమోదు మిగతా 2లో...



## డ్వాక్రా సంఘాలకు
# డబుల్ రిలీఫ్



- రుణాలపై ప్రాసెసింగ్, ఇన్‌స్పెక్షన్ ఫీజుల రద్దు
- లక్షలాది సంఘాలకు ఆర్థిక భారం తగ్గింపు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుభవార్త అందించింది. సంఘాలకు మంజూరు చేసే రుణాలపై విధిస్తున్న ప్రాసెసింగ్, ఇన్‌స్పెక్షన్ చార్జీలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశాల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సెర్ప్ అధికారుల విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మిగతా 2లో...

# 'టూరిజం హబ్'గా పోలవరం ప్రాజెక్టు

- తెలుగుదనంతో పాటు, రాష్ట్ర ఔన్నత్యం ఉట్టి పడేలా పోలవరం
- జపాన్ నిప్పాన్ కోయి సంస్థతో డిజైన్స్ పై చర్చలు.
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు నిర్దేశిని, రాష్ట్ర ప్రజల జీవనాడి ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టుని టూరిజం హబ్ గా మార్చబోతున్నట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. పోలవరం బ్యూటిఫికేషన్ కు సంబంధించి బుధవారం ఆయన అధికారులు, ఆర్కిటెక్ట్ లు , ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. తెలుగుదనంతో పాటు, రాష్ట్ర ఔన్నత్యం ఉట్టి పడేలా పోలవరం స్పిల్వే ఉండాలని గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారన్నారు.

పోలవరం ప్రాజెక్టు పరిధిలో 10 వేల ఏకరాలను లైడార్ సర్వే ద్వారా గుర్తించి, పోలవరం ను టూరిజం హబ్‌గా డిజైన్ చేయబోతున్నామన్నారు. పోలవరం రైట్, లెఫ్ట్ బ్యాంక్ ను కలుపుతూ,బ్రిడ్జిల నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఏలూరు, కొవ్వూరు, రాజమండ్రి లను జాతీయ రహదారులతో పోలవరం ప్రాజెక్టుని అనుసంధానించేలా మిగతా 2లో...



# పట్టణాలకు పచ్చని వరం

- రూ.36 కోట్లతో 18 నగర వనాల ప్రారంభం
- ప్రకృతితో కూడిన అభివృద్ధే శాశ్వతం: పవన్ కల్యాణ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'ఏ దేశమైతే ప్రకృతితో కలిసి ఎదుగుతుందో, ఆ దేశం ఎప్పటికీ నిలిచి ఉంటుంది. ప్రకృతితో పాటు సాధించే అభివృద్ధే శాశ్వతంగా ఉంటుంది' అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మన వారసత్వం అనేది కేవలం మనం నిర్మించిన కట్టడాలు కాకూడదని, మనం కాపాడిన ప్రకృతి అయి ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో కొత్తగా అభివృద్ధి చేసిన 18 నగర వనాలు, ఎకో పార్కులు, కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం ప్రాజెక్టులను బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ గా ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. వర్చువల్ గా ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, సవిత పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "నగరాలు, పట్టణాలు శరవేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ నగర వనాలు పట్టణాలకు గ్రీన్ లంగ్స్ లాగా పని చేస్తూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడతాయి. కేంద్ర ప్రభుత్వ 'నగర వన యోజన' నిధులతో పాటు స్థానిక నిధులను సమకూర్చుకుంటూ రూ. 36 కోట్ల భారీ వ్యయంతో ఈ ప్రాజెక్టును సిద్ధం చేశాం. ఒక్కో నగర వనాన్ని సుమారు 50 హెక్టార్ల విస్తీర్ణంలో, రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించాం. కొడూరు, కైలాసగిరి, మదనపల్లెలలో ప్రత్యేకంగా ఎర్రచందనం పరిరక్షణ పార్కులను ఏర్పాటు చేశాం. మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయ జ్ఞానాన్ని చాటి చెప్పేలా, జీవవైవిధ్య పరిరక్షణే ధ్యేయంగా నక్షత్ర వనాలు, రాశి వనాలను అభివృద్ధి చేశాం. ఈ పార్కులు కేవలం పచ్చదనాన్ని ఇవ్వడమే కాకుండా, ప్రజల శారీరక, మానసిక ఉల్లాసానికి మిగతా 2లో...

# ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం



(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవాలని సూచించారు.

ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను కోరిన ఆయన, ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హజ్ యాత్రకు ప్రభుత్వ భరోసా



(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం హజ్ యాత్రికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ ఏడాది దాదాపు రెండు వేల మంది హజ్ యాత్రకు వెళ్లారని, విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని ఎంచుకున్న ప్రతి యాత్రికుడికి ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై యాత్రికులు సంతృప్తి వ్యక్తం చేశారని, మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు.

హజ్--2027 యాత్రకు దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభమైందని, జూలై 20 వరకు గడువు ఉందని మంత్రి తెలిపారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఆసక్తి ఉన్నవారు గడువులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాస్‌పోర్ట్ కనీసం 2027 డిసెంబర్ 31 వరకు చెల్లుబాటు అయ్యేలా ఉండాలని, అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు సమర్పించాలని చెప్పారు. రాష్ట్రంలోని ముస్లిం సోదరులు, సోదరీమణులు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని ఎంపిక చేసుకుని ప్రభుత్వం అందించే రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని వినియోగించుకోవాలని మంత్రి ఫరూక్ విజ్ఞప్తి చేశారు.

### 'టూరిజం హబ్'గా

# పోలవరం ప్రాజెక్టు



(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదనను పరిశీలిస్తున్నాన్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు నుండి పాపికొండలు మీదుగా భద్రాచలం వరకు టూరిజం హబ్ గా మార్చేలా జపాన్ కు చెందిన నిప్పాన్ కోయి ఏజెన్సీ ఇచ్చిన పలు డిజైన్స్ పరిశీలించారు.

పోలవరం ప్రాజెక్టు ఏరియాలో గోదావరి ఔన్నత్యాన్ని, పరివాహక ప్రాంత సంస్కృతి చాటేలా మ్యూజియం, వాటర్ స్పోర్ట్స్, టెంపుల్ టూరిజం, రిసార్ట్స్, హట్స్, ఎమ్యూజ్మెంట్ పార్క్ లు అభివృద్ధి చేసేలా ప్రణాళికలకు రూపకల్పన చేస్తున్నామన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలన చేసి డిజైన్స్ ఫైనల్ చేస్తారని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్ సి నరసింహమూర్తి, జపాన్ కు చెందిన నిప్పాన్ కోయి ఏజెన్సీ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో 3 వేల మంది వైద్యులు

(మొదటి పేజీ తరువాయి)

వారి కుటుంబాల్లో ఉండే ఆందోళనను అర్థం చేసుకుంటూ సేవా భావం, మానవతావాదంతో వ్యవహరించాలని కోరారు. గడిచిన 2 సంవత్సరాల్లో కొత్తగా విధుల్లోనికి వచ్చిన 3000 మంది యువ వైద్యులు రోగులకు వైద్య సేవలు అందిస్తూనే పరిశోధనలపై దృష్టి పెట్టాలన్నారు.

కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, స్థానిక పట్టణ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, వరుణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం జరిగిన 'జాతీయ వైద్యుల దినోత్సవ' వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ గడిచిన రెండు సంవత్సరాల్లో కూటమి ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల బలోపేతానికి అవసరమైన అన్ని రకా ల చర్యలు తీసుకున్నందువల్ల ఓపీలో 18%, ఐపీలో 6.5% చొప్పన వృద్ధి నమోదైందన్నారు. జీరో వెకెన్సీ విధానంలో ప్రభుత్వాసుపత్రుల్లో పారా మెడికల్ కేటగిరిలో అన్ని స్థాయుల్లో కలిపి 12వేల ఖాళీలను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసామన్నారు. వైద్యుల ఖాళీల్లో 3వేల వరకు భర్తీ చేసినట్లు తెలిపారు. రోగులకు ప్రభుత్వాసుపత్రుల్లో ఉన్నత వైద్యం అందించడంలో కూటమి ప్రభుత్వం రాజీపడడంలేదని స్పష్టంచేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఒక్కో యూజీ, పీజీ విద్యార్థిపై అన్ని రకాలుగా కలిపి సుమారు రెండు కోట్ల వరకు ప్రభుత్వ వ్యయం చేస్తోందని చెప్పారు.

**వ్యాధులు రాకముందే..!** : వ్యాధులు వచ్చిన అనంతరం చికిత్స అందించే సంప్రదాయక విధానం నుంచి వాటి నివారణకు ప్రాథమిక దశలోనే అవసరమైన చర్యలు (రియాక్టీవ్ నుంచి ప్రివేంటివ్ దిశగా) తీసుకునే విధానానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల నుంచి ఉద్భవించిన సంజీవని పథకం ద్వారా ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలతో పౌరుల ఆరోగ్య రికార్డులను తయారుచేస్తున్నామని తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన సదస్సులో గేమ్ చేంజర్ గా మారబోతున్న సంజీవని పథకం గురించి పొరుగు రాష్ట్రాల మంత్రులు, అధికారులు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారని తెలిపారు. జీవనశైలి వ్యాధుల ను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు ఎన్సీడీ-04 (సర్వే) ద్వారా ఇంటింటికి వెళ్లి రొమ్ము, సర్వైకల్, ఓరల్, ఇతర స్క్రీనింగ్ పరీక్షలను వైద్య సిబ్బంది చేస్తున్నారని తెలిపారు. క్యాన్సర్ కారణంగా అమ్మ, సోదరిలను కోల్పోయిన తాను ఆ కేసులు తగ్గించేందుకు కృషి చేస్తున్నానన్నారు. గుంటూరు జీజీహెచ్ పెట్ సీటీ స్కాన్ సౌకర్యాన్ని కూడా ఉచితంగా కల్పించామన్నారు. కర్నూలులోని క్యాన్సర్ సెంటర్ ను స్టేట్ సెంటర్ గా గుర్తించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. విశాఖ, కాకినాడ, ఇతరచోట్ల కూడా క్యాన్సర్ సేవలను విస్తృతం చేస్తున్నామని తెలిపారు. గోల్డెన్ అవర్లో గుండెపోటు వచ్చిన వారికి (స్టెమీ పథకం ద్వారా ) ఉచితంగా రూ. 40వేల ఇంజక్షన్ (టెనెక్ట్ ప్లస్)ను ఇస్తూ 93% మంది (సుమారు 5,020 మంది)ని ప్రాణాపాయ పరిస్థితుల నుంచి కాపాడినట్లు తెలిపారు. సదరం ద్వారా 21 రకాల సర్టిఫికెట్స్ జారీ చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం చేబడుతున్న అభివృద్ధి చర్యలకు ఐఎంఏ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

**సరళీకృతం చేయాలి...!** : ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి చంద్రబోస్ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణకు అవరోధశీగా ఉన్న నియమ నిబంధనలు (ఫైర్ సెఫ్టీ ఎన్ఓసి, ఇతర)ను సరళీకృతం చేయాలని తెలిపారు. లేకుంటే సింగిల్ క్లినిక్కులను నిర్వహించడం భవిష్యత్తులో మరింత



కష్టమవుతుందని ఆందోళనను వ్యక్తవచ్చేశారు. ఐఎంఏ ప్రతినిధులు వినోద్ కుమార్, వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు వాసిగా ఉన్న మంత్రి సత్యకుమార్ నేతత్వంలో వైద్య ఆరోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ రమేష్ నాధ్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల సెకండరీ ఆసుపత్రు ల్లో సంక్లిష్ట శస్త్ర చికిత్సలను సైతం వైద్యులు చేయగలుగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ వైద్యుల సేవలను కీర్తిస్తూ మంత్రి వారిని సత్కరించారు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

సీనియర్ వైద్యులు ఎస్.కే.వీ. ప్రసాద్ రెడ్డి, గిరిధర్, స్వరూప్ కుమార్ రెడ్డి, సువర్ణ సేవలను కీర్తిస్తూ మంత్రి వారిని సత్కరించారు.

కార్యక్రమంలో పాల్గొనేందుకు భారీ సంఖ్యలో వచ్చిన వారిని మంత్రి ఆప్యాయంగా పలకరించారు. ప్రొద్దుటూరు కు చెందిన మంత్రి సత్యకుమార్ ఇక్కడే (ప్రొద్దుటూరు) డాక్టర్స్ డే నిర్వహించడం పట్ల వక్తలు తమ ప్రసంగాల ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

# 'నో అడ్మిషన్' బోర్డులే లక్ష్యం

**రేణిగుంట (జర్నలిస్ట్ ఫైల్)** : విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ 2 సెంట్ల మేర ఇంటి పట్టాలు అందజేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి అత్యుత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ఇంటి స్థలం మంజూరుకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన మంత్రి నారా లోకేష్.. రేణిగుంట సమీపంలోని కొత్తపాలెం వేదిక వద్ద పదో తరగతి టాపర్లు అయిన పి.జస్మిత, జి.సాయి పూజిత, పి.మోహిత్ చరణ్ సాయిలకు ఒక్కొక్కరికీ శ్రీకాళహస్తి పట్టణం రాజీవ్ నగర్ లో 2 సెంట్ల చొప్పున ఇంటి పట్టాలు అందించారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గం కుంటిపూడికి చెందిన జస్మిత పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 600 మార్కులకు గాను 598 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్, జిల్లాలో ప్రథమ ర్యాంక్ సాధించారు. అదేవిధంగా శ్రీకాళహస్తి బాబు అగ్రహారం మున్సిపల్ హైస్కూల్ లో విద్యనభ్యసించిన సాయి పూజిత 594 మార్కులు సాధించారు. తొండమనాడు జడ్పీ హైస్కూల్ లో చదివిన మోహిత్ చరణ్ సాయి 591 మార్కులు సాధించారు.



**విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యం** : ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. మంగళగిరి నియోజకవర్గం నిడమర్రులోని ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశానికి విపరీతమైన పోటీ నెలకొంది. భవిష్యత్ లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డులు కనిపించాలనేదే మా లక్ష్యం. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంకల్పంతోనే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ సాధించగలుగుతాం. విద్యార్థులకు విలువతో కూడిన విద్యను అందిస్తామని మంత్రి చెప్పారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరు భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంత్రి సన్మానించారు.

# పట్టణాలకు పచ్చని వరం



(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాలుగా నిలవనున్నాయి. ఇందులో పక్షుల ఆవాసాలు, బోటింగ్, కయాకింగ్ (చిన్న పడవలు నడపడం), ట్రెకింగ్ పాయింట్లు, యోగా కేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు వంటి ఎన్నో ప్రత్యేక ఆకర్షణలను అందుబాటులోకి తీసుకొచ్చాం.

**పచ్చదనాన్ని కాపాడుకుందాం** : కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న ఆధునిక నగరాలలో, అలసిన మనుషులకు ఈ నగర వనాలు ప్రకృతిలోని ప్రశాంతతను పరిచయం చేస్తాయి. ఇవి కేవలం నేటి అవసరాల కోసమే కాదు, రాబోయే తరాల కోసం మనం అందిస్తున్న పచ్చని వారసత్వం. ప్రతి ఒక్కరూ వీటిని కాపాడుకుంటూ, మరింత పచ్చని, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి' అని పిలుపు నిచ్చారు.

**స్వయంగా పరిశీలించాను... నిజంగా అద్భుతం : మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ "నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఉన్న నగర వనాన్ని స్వయంగా వెళ్లి పరిశీలించాను. పచ్చదనం, ప్రశాంతతో పాటు ఏర్పాటు చేసిన అత్యాధునిక వసతులు కుటుంబంతో కలిసి సమయం గడపడానికి ఎంతో అద్భుతంగా ఉన్నాయి. నగర వనానికి సమీపంలోనే ఉన్న గుట్టను, దానిపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని ఈ పార్కుతో అనుసంధానం చేస్తే బాగుంటుంది. పార్కును, గుట్టను కలిపి ట్రెకింగ్ పాయింట్‌గా అభివృద్ధి చేస్తే, అది నగరవాసులకు ఒక సరికొత్త ఆధ్యాత్మిక, సాహస పర్యాటక అనుభూతిని అందిస్తుంద"న్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి, గౌతు శిరీష, డా. బి.వి.జయనాగేశ్వర రెడ్డి, డా.పార్థసారథి, మహమ్మద్ షాజహాన్ బాషా, అటవీ పర్యావరణశాఖల ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లిఖార్జునరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ ఎన్. నాగేశ్వరరావు, ఐ.టి. అడ్వైజర్ పి. నాగేశ్వరరావు, డి.సి.ఎఫ్. ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

14

# డ్వాక్రా సంఘాలకు డబుల్ రిలీఫ్

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు రూ. 10 లక్షలకు పైబడిన క్యాష్ క్రెడిట్ రుణాలు, రూ. 5 లక్షలకు పైబడిన టర్మ్ లోన్లపై ప్రాసెసింగ్ చార్జీలతో పాటు, ప్రతి త్రైమాసికం ఇన్‌స్పెక్షన్ చార్జీలు కూడా వసూలు చేసేవారు. దీంతో మహిళా సంఘాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని, మహిళలకు తక్కువ వ్యయంతో రుణాలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఇది ఆటంకంగా మారిందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ చార్జీలను రద్దు చేసిన యూనియన్ బ్యాంక్ యాజమాన్యానికి మహిళా సంఘాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ప్రస్తుతం రాష్ట్రంలో యూనియన్ బ్యాంక్ 2.50 లక్షలకు పైగా స్వయం సహాయక సంఘాలకు రూ. 20,359 కోట్లకు పైగా రుణాలు అందిస్తూ అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ నిర్ణయంతో రూ. 20 లక్షల క్యాష్ క్రెడిట్ రుణం పొందిన ప్రతి సంఘానికి మూడేళ్లలో రూ. 93,500 వరకు ఆదా అవుతుందని, యూనియన్ బ్యాంక్ నుంచి రుణాలు తీసుకున్న 1.75 లక్షల సంఘాలకు ఏడాదికి సుమారు రూ. 586.25 కోట్ల మేర ప్రయోజనం కలుగుతుందని మంత్రి వివరించారు.



"ఒక్కో కుటుంబం-ఒక్కో పారిశ్రామికవేత్త" లక్ష్య సాధనకు ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఈ అంశంపై స్పందించకపోవడంతో మహిళా సంఘాలు భారీగా నష్టపోయాయని విమర్శించారు. మహిళల ఆర్థిక సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్వయం సహాయక సంఘాలకు మరింత ప్రోత్సాహం అందించే చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ఇంటింటికీ కూటమి పాలన

**శ్రీకాళహస్తి (జర్నలిస్ట్ ఫైల్)** : ఈ రోజు మేం పదవుల్లో కూర్చోవడానికి టిడిపి కేడర్ చెమట, త్యాగమే కారణం. వారి త్యాగాలను ఎన్నడూ మరువబోమని తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం బుధవారం రేణిగుంట సమీపంలోని కొత్తపాలెంలో జరిగింది. ఈ సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ... ఉమ్మడి చిత్తూరు జిల్లా అంటే మా కుటుంబానికి ప్రత్యేకమైన ప్రేమ. స్టూడెంట్ లీడర్ గా ప్రయాణం ప్రారంభించిన చంద్రబాబును ఎమ్మెల్యేగా, మంత్రిగా, నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన నేల చిత్తూరుజిల్లా. స్వర్గీయ ఎన్టీఆర్ కు కూడా చిత్తూరుపై ప్రేమ ఉంది. మహిళలకు ఉన్నత విద్య అందించాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ ఏర్పాటుచేసిన నాయకుడు ఎన్టీఆర్. వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదానం ప్రారంభించిన వ్యక్తి ఎన్టీఆర్. చంద్రబాబు గారు 2003లో ప్రాణదాన ట్రస్ట్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాకు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు తెచ్చిన ఘనత చంద్రబాబుది. ఒక పక్క ఎన్టీఆర్, ఇంకోవైపు చంద్రబాబు ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేశారు.

**కుంభకోణాల్లో మునిగిన చరిత్ర గొడ్డలి పార్టీది** : ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలు మంచి చేస్తే ప్రేమిస్తారు, మోసం చేస్తే జీరో చేస్తారు. మొన్న జరిగిన ఎన్నికల్లో గొడ్డలిపార్టీని ఎలా శిక్షించారో చూశాం. ఉమ్మడి చిత్తూరులో మనపార్టీ నాయకులు, గొడ్డలి పార్టీ నాయకులను బేరీజు వేయండి. దోపిడీ, దౌర్జన్యాలు, లిక్కర్, ఎర్రచందనం స్మగ్లింగ్, టిడిఆర్ కుంభకోణాల్లో మునిగిన చరిత్ర వైసిపి నేతలది. మన పార్టీలో గతంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ఎన్. శివప్రసాద్ లాంటి నిష్కళంక నాయకుల చరిత్ర మనది. ఇప్పుడు యువరక్తం కూడా ముందుకు నడుస్తుంది. తెలుగుదేశం పార్టీ కంచుకోట శ్రీకాళహస్తి నియోజకవర్గం. గోపాల్ అన్నకు, బాబు గారికి ఉన్న బంధం... మీ లోకేష్ కు-- సుధీర్ కు ఉంది. ఆయన ఓవర్ స్పీడ్ వల్ల కొన్నిసార్లు యాక్సిడెంట్లు కూడా అవుతున్నాయి. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న బడాచోర్ ఎలా వేధించారో, దానివల్ల ప్రజలు ఎలాంటి తీర్పు ఇచ్చారో చూశాం. సుధీర్ నేను చేయలేని పని చేశారు. అనంత్ అంబానీ ద్వారా సుమారు 50కోట్లు విరాళాలు తీసుకొచ్చారు. నియోజకవర్గంలో బాగా చదువుకున్న పిల్లల కుటుంబాలకు 3సెంట్ల భూమి ఇచ్చారు.

**పనిచేసిన కేడర్ కు న్యాయం చేసే బాధ్యత నాది** : మనమంతా కలసికట్టుగా ముందుకు నడవాలి. 2025మహానాడులో ఆరుశాసనాలను ప్రకటించాం. అందులో ముఖ్యమైంది కార్యకర్తే అధినేత. పుంగనూరులో అంజిరెడ్డి తాత, పల్నాడులో మంజుల, విజయవాడలో చెన్నుపాటి గాంధీ, పార్టీకోసం ప్రాణాలు కోల్పోయిన తోట చంద్రయ్య మనకు ఆదర్శం. పక్కరాష్ట్రంలో ఒక్కఎన్నికల్లో ఓడిపోతే ఎలా అయ్యారో చూశాం. 45ఏళ్ల ప్రస్థానంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నిలబడింది తెలుగుదేశం. నేను తీసుకునే నిర్ణయాల్లో తప్పులుంటే సరిదిద్దుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 8మందికి రాష్ట్రస్థాయి, 53మందికి నియోజకవర్గస్థాయి పదవులు ఇచ్చాం. ప్రతిపదవిని చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఒక్క పొరపాటు జరిగినా మమ్మల్ని తిట్టిపోస్తున్నారు. అందుకే ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా ముందుకెళ్తున్నాం. ప్రతిపక్షంలో ఉన్నపుడు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేసే బాధ్యత నాది.

**కార్యకర్తలకు అండగా నిలుస్తాం** : పాడిరైతులను ఆదుకోవడానికి చంద్రబాబు ఆనాడు పీలేరులో ఒక్క మిల్క్ చిల్లింగ్ సెంటర్ పెట్టారు. నా తల్లి భువనేశ్వరి, బ్రాహ్మణి కష్టం వల్ల హెరిటేజ్ ఉన్నతస్థాయికి చేరింది. మూడు దశాబ్దాల తర్వాత 7లక్షల లీటర్ల పాలసేకరణ స్థాయికి వచ్చింది. అధికారాన్ని అడ్డుపెట్టుకొని సంపాదించాలనుకోవడం చాలా తప్పు. నియోజకవర్గంలో పార్టీ కేడర్ ను ఆర్థికంగా బలోపేతం చేసే బాధ్యత ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి అప్పగిస్తున్నాను. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వారి నియోజకవర్గంలో 25మందితో చిన్నతరహా పరిశ్రమలు పెట్టించారు. దానిని ఇక్కడ కూడా అమలుచేయండి, అండగా నిలుస్తాం. క్లస్టర్ ఇన్‌చార్జిల ట్రైనింగ్ లో భాగంగా యోగా నేర్పించాం, యూనిట్ సభ్యులకు ట్రైనింగ్ తాజాగా ప్రారంభించాం. సుమారు 1300 మంది యూనిట్ ఇన్‌చార్జిలకు పరీక్షలు చేస్తే 75శాతం మందికి సుగర్, బిపి, కొలెస్ట్రాల్ ఉన్నాయి. చాలామందికి ఆరోగ్య సమస్య ఉందని కూడా తెలియదు. క్లస్టర్, యూనిట్, గ్రామస్థాయి వరకు నాయకులకు ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందజేయాలని అధినేత చంద్రబాబు నిర్ణయించారు.



**కలసికట్టుగా పార్టీని బలోపేతం చేద్దాం** : తెలుగుదేశం పార్టీ ఒక పెద్ద కుటుంబం. కోటిమందికి పైగా ఉన్న అతిపెద్ద వ్యవస్థలో చిన్నచిన్న సమస్యలు ఉంటాయి. అంతర్గతంగా వాటిని పరిష్కరించుకోవాలి. బయటకు వెళ్తే జై తెలుగుదేశం, జై చంద్రబాబు అని ఏకతాటిపై నిలవాలి. అలిగి ఇంట్లో పడుకుంటే నష్టపోయేది మనమే. కలిసికట్టుగా పార్టీని బలోపేతం చేద్దాం.

**కూటమి విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి** : కూటమి ప్రభుత్వ విజయాలపై జులై 15వతేదీ నుంచి డోర్ టు డోర్ ప్రచారం ప్రారంభిస్తాం. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ఇస్తున్న సంక్షేమం డోర్ టు డోర్ క్యాడర్ ప్రచారం చేయాలి. జులై 16,17,18 మెగా పిటిఎం నిర్వహించే సమయంలోనే తల్లికి వందనం రెండో విడత డబ్బు తల్లుల ఖాతాలో జమచేస్తాం. సంక్షేమంతోపాటు పెద్దఎత్తున అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నాం. పరిశ్రమలు, పెట్టుబడులు ప్రవాహంలా వస్తున్నాయి. యువగళంలో మెగా డిఎస్సీ హామీ ఇచ్చా. ప్రజలఆశీస్సులతో అధికారంలోకి వచ్చాక 150రోజుల్లో 16వేల టీచర్ పోస్టులు భర్తీచేశాం. 6వేల కానిస్టేబుల్ పోస్టులు కూడా ఇచ్చాం. ఈ ఏడాది 10వేల పోస్టులతో మెగా జాబ్ క్యాలండర్ ప్రకటించాం. ఆగిపోయిన అమరావతి, పోలవరం పనులను పరుగెత్తిస్తున్నాం. మనం సాధించిన ఈ విజయాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

**ప్రజలతో అనుబంధం పెంచుకోండి** : పార్టీ కేడర్ ఓపికగా ప్రజలవద్దకు వెళ్లి వారితో మమేకం కావాలి. 1985 తర్వాత గెలవని మంగళగిరిలో పోటీచేసి నేను తొలిసారి ఓడిపోయా, అదే నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో 91వేల పైచిలుకు మెజారిటీతో గెలిచా. నాకు, ప్రజలకు మధ్య ఏర్పడిన అనుబంధమే ఈ ఘన విజయానికి ప్రధాన కారణం. ఇలాంటి అనుబంధాన్ని ప్రతి కార్యకర్త ప్రజలతో కొనసాగించాలి. కష్టపడి పనిచేసిన వాళ్లను గుర్తించేందుకు మై టిడిపి యాప్ తెచ్చాం. ప్రతి కార్యకర్త ఈ యాప్ ను డౌన్ లోడ్ చేసుకొని వారుచేసిన ప్రతి కార్యక్రమాన్ని పార్టీకి తెలియజేయండి.

**గొడ్డలిపార్టీ విధ్వంసాన్నీ ప్రజలకు తెలియజేయండి** : మన రాష్ట్రంలో గొడ్డలిపార్టీ ఉంది, వారికి కూడా అనుబంధ విభాగాలు ఉన్నాయి. వాళ్లకు గంజాయి, బ్లేడ్, సైకో బ్యాచ్ లు ఉన్నాయి. వారి నేరచరిత్రను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లండి. లా అండ్ ఆర్డర్ గురించి జగన్ మాట్లాడుతున్నారు. వైసిపి ఎమ్మెల్సీ దళిత డ్రైవర్ ను చంపి డోర్ డెలివరీ చేస్తే ఇప్పటివరకు సస్పెండ్ చేయలేదు. గొడ్డలిపార్టీ హత్యాకాండను ప్రజలకు వివరించాలి. జగన్ మాటతప్పం, మడమ తిప్పం అంటారు. వాళ్లు అబద్దాలు చెప్పినట్లు, మనం నిజాలు కూడా చెప్పలేకపోతున్నాం. మొన్నటివరకు 3రాజధానులు అన్న జగన్ ఇప్పుడు మావిగన్ అంటున్నాడు, రేపు బెంతాహై అంటాడు. వాటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉంది. గొడ్డలిపార్టీ అరాచకం, వేధింపులు, అహంకారం వంటి అవలక్షణాలు మనవాళ్లకు అంటకూడదు. ప్రజలు మనం పొరపాటు చేయకూడదని కోరుకుంటున్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షల మేరకు పనిచేయాలి. అహంకారం, అవినీతికి తావీయకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలి.

**రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు అవసరం** : రాష్ట్రం స్థిరంగా అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. ఒకే ప్రభుత్వం సుదీర్ఘంగా ఉండటం వల్ల గుజరాత్, ఒరిస్సా రాష్ట్రాలు అభివృద్ధి చెందాయి. ఆ రాష్ట్రాలకు పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయి. ఈరోజు ప్రతి వందరూపాయల పెట్టుబడుల్లో 25రూపాయలు ఏపీకి వస్తున్నాయి. మిగతా 75 రాకపోవడానికి వైసిపి విధ్వంస పాలనే కారణం. గొడ్డలిపార్టీ వస్తే మా పరిస్థితి ఏమిటని ఈరోజు పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడకు వెళ్లినా ముందు కేడర్ ను కలిశాకే చంద్రబాబు, నేను అధికారిక కార్యక్రమాలకు వెళు_న్నాం. కలసికట్టుగా జై తెలుగుదేశం, జై చంద్రబాబు అన్నదే మన నినాదం కావాలి. రెడ్ బుక్ దానిపని అది చేస్తుంది. కేడర్ కు ఎటువంటి డౌట్లు అవసరం లేదని లోకేష్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి శ్రీకాళహస్తిలో స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పునరుద్ధరించే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు. ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంటు ఇన్‌చార్జి పనబాక లక్ష్మి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, కాణిపాకం దేవస్థానం చైర్మన్ మణినాయుడు, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే... మా రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)



గత పాలకులు నెల్లూరు జిల్లాను అశాస్త్రీయంగా విభజించారు. గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చి నెరవేర్చాం. సైదాపురం, కలువాయి మండలాలను కూడా నెల్లూరు జిల్లాలో కలిపాం. ప్రజల అభీష్టం ప్రకారమే పరిపాలన జరగాలి. పెత్తందారీ వ్యవస్థకు చోటు లేదు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఆశాస్త్రీయంగా జరిగినల్లాల విభజనను సవరించాం. ప్రజల జీవితాల్లో శాశ్వతంగా వెలుగు నింపాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నాం. సామాజిక బాధ్యతగానే ప్రతీ నెలా 1వ తేదీన కనీస అవసరాలు తీర్చుకోలేని ఆపన్నులకు పెన్షన్ అందిస్తున్నాం. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు సహా 28 కేటగిరీల లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తూ వారిని ఆదుకుంటున్నాం. పేదల జీవన ప్రమాణాలను పెంచాలనే లక్ష్యంతో పీ4 కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నాం. ఇప్పటి వరకూ రూ. 68,598 కోట్ల మేర పెన్షన్ల కింద కూటమి ప్రభుత్వం పంపిణీ చేసింది. ప్రతీ నెలా 62.20 లక్షల మందికి రూ. 2,712 కోట్లు పెన్షన్లకు చెల్లిస్తున్నాం.' అని సీఎం అన్నారు.

**పొదుపు ఉద్యమానికి డ్వాక్రా మహిళలే దిక్సూచి :** గడిచిన రెండేళ్ల ప్రయాణంలో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయటంతో పాటు వ్యవస్థలను గాడిలో పెట్టామని, సంక్షోభాలు, సమస్యలను దాటుకుని ప్రజలకు మేలు చేసేలా అనునిత్యం పనిచేస్తున్నామని అన్నారు. 'గత పాలకులు ఐదేళ్ల పాటు విధ్వంసం చేశారు... రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. రెండేళ్ల లోనే అన్ని పనులూ చేసేశామని మేం చెప్పటం లేదు. కానీ శుభారంభం చేశాం. గత అవినీతి పాలనను మార్చి రాష్ట్రంలో మళ్లీ సుపరిపాలన తీసుకువచ్చాం. మనమిత్ర వాట్సప్ గవర్నెన్సు ద్వారా ఆన్‌లైన్‌లో సేవలను అందిస్తూ ప్రజల చేతిలోకి పౌర సేవలను తీసుకువచ్చాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు అందించగలుగుతున్నాం. తల్లికి వందనం, స్త్రీశక్తి, దివ్యాంగ శక్తి, మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో లాంటి వివిధ పథకాలను అమలు చేశాం. పేదల జీవన ప్రమాణాలు పెంచి వారికి అండగా నిలవాలనేది కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం. సంపన్నులైన 10 శాతం మంది అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మంది పేదలను ఆదుకునేలా పీ4 కార్యక్రమం చేపట్టాం. ఆర్థిక అసమానతలు తొలగించి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు నా జీవితాన్ని అంకితం చేశాను. లక్ష మందికి పైగా మార్గదర్శులు, 10 లక్షలకు మందికి పైగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని అన్ని విధాలా సహకారం అందిస్తున్నారు. మహిళలను పారిశ్రామిక, వ్యాపార వేత్తలుగా తయారు చేసేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. పొదుపు ఉద్యమంలో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శంగా నిలిచారు. అందుకే బ్యాంకులు కూడా డ్వాక్రా మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు అందించేందుకు ముందుకు వస్తున్నాయి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**రాష్ట్రంలోనే అగ్రగామిగా నెల్లూరు జిల్లా :** 'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందాలన్నదే మా ఆకాంక్ష. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లుగా చేసి అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నాం. అభివృద్ధిలో సంపద సృష్టిలో నెల్లూరు జిల్లా దేశంలోనే అగ్రగామి జిల్లాగా మారుతుంది. రామాయపట్నం పోర్టు, కృష్ణపట్నం పోర్టు, దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ వస్తున్నాయి. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ లక్ష కోట్లతో రిఫైనరీ పెడుతోంది. ఇఫ్కో కిసాన్ సెజ్ లో కూడా పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయి. ఇప్పటికే గూడూరు ప్రాంతంలో 27 మెగా పరిశ్రమలు వచ్చాయి. మెగా ఫర్నిచర్ పార్కు కూడా ఏర్పాటు కాబోతోంది. మన రాష్ట్రంలోనే ఉన్న శ్రీసిటీ దేశ పారిశ్రామిక ప్రాంతాలకు ఆదర్శం. గత పాలకుల వల్ల రాష్ట్రం నుంచి పెట్టుబడులు పారిపోయాయి. ఇప్పుడు కూటమిపై నమ్మకంతో పెట్టుబడి దారులు తిరిగి వస్తున్నారు. జాతీయ రహదారి కారిడార్లు, 4 లేన్ రైల్వే ట్రాక్ కూడా మన ప్రాంతం నుంచి వెళ్లేలా ప్రాజెక్టులు వస్తున్నాయి. అన్ని పోర్టులకూ రైల్వే లైన్లను అనుసంధానించి ఈ ప్రాంతాన్ని లాజిస్టిక్స్ కేంద్రంగా తయారు చేస్తాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**నీటి భద్రతపై నిరంతరం శ్రద్ధ :** 'సాగునీటికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. 36 ప్రాజెక్టులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసేలా కేలండర్ విడుదల చేశాం. ఇప్పటికే సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ. 24 వేల కోట్లు ఖర్చు చేశాం. ఈ ప్రాంతానికి అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇస్తాం. ఇంకా రూ. 4 వేల కోట్ల పనులు పెండింగ్ ఉండగానే గత పాలకుడు ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేశారు. డ్రామాల రాయుడికి నాటకాలు ఆడటమే పని. రూ. 900 కోట్లు పునరావాసానికి నిధులు విడుదల చేస్తున్నాం. ఇప్పటికే నిర్వాసితులకు రూ. 300 కోట్లు చెల్లింపులు చేశాం. త్వరలోనే మిగతా మొత్తాన్ని కూడా చెల్లిస్తాం. రూ. 2,500 కోట్లతో వెలిగొండ మొదటి దశను పూర్తి చేసి ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప తదితర జిల్లాలకు నీళ్లిస్తాం. ఎల్ నినో ప్రభావం ప్రపంచ దేశాలపై తీవ్రంగా ఉంది. వర్షాలు బాగా తగ్గాయి. గత ఏడాది పడిన వర్షాలకు గోదావరి, కృష్ణానదులు పొంగి పొర్లాయి. ఆ సమయంలోనే రిజర్వాయర్‌లను నింపాం. ఈ ఏడాది ఇప్పటికీ నదుల్లో ప్రవాహాలు రాలేదు. అయినా ప్రాజెక్టుల్లో 65 శాతం మేర నిల్వలు ఉన్నాయి. అందుకే భూమినే జలాశయంగా మార్చుకునేలా జల ధార లాంటి కార్యక్రమాలు చేపట్టాం. నదుల అనుసంధానం చేసేలా ప్రణాళికలు కూడా చేపట్టాలని ఆలోచన చేస్తున్నాం. గోదావరి-కావేరి నదుల అనుసంధానం చేస్తే దిగువ రాష్ట్రాలకూ నీరు ఇచ్చే పరిస్థితి ఉంటుంది' అని సీఎం అన్నారు.

**తీవ్రవాదుల తరహాలో ప్రజల్ని భయపెడుతున్నారు :** 'పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో పెట్రోలు, డీజిల్ ధరలు కూడా పెరిగాయి. ఈ సమయంలోనే ఇథనాల్ వినియోగించుకుని ఇంధన పొదుపు చేయాల్సి ఉంది. ఇథనాల్ తయారీ కోసం మొక్కజొన్న లాంటి పంటలు అవసరం అవుతాయి. రైతులు ఈ ప్రత్యామ్నాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరిశ్రమల్ని ఆహ్వానించడానికి సమయం పడుతుంది. కానీ తరిమి కొట్టడానికి ఒక్క క్షణం చాలు. గత పాలకులు పరిశ్రమల్ని రాష్ట్రం నుంచి తరిమి కొట్టారు. కర్ణాటకకు వెళ్లిపోవాల్సిన హీరో మోటార్స్ సంస్థను రాష్ట్రానికి తీసుకువచ్చి ఇక్కడ మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేసేలా కృషి చేశాం. కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు కూడా 3వ తేదీన శంకుస్థాపన చేయబోతున్నాం. 2028 నాటికి ఆ రాయలసీమలో స్టీల్ పరిశ్రమ ఉత్పత్తి కూడా ప్రారంభిస్తుంది. నా ప్రయత్నం అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందించటమే. గొడ్డలి పార్టీ తీవ్రవాదుల తరహాలో అందరినీ భయాందోళనలకు గురి చేస్తోంది. రోజుకో ఫేక్ న్యూస్, రోజుకో విన్యాసంతో గొడ్డలి పార్టీ కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోంది. గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చింది. మేం అధికారంలోకి వచ్చాక ఈగల్ టాస్క్ ఫోర్సు ద్వారా నియంత్రించాం. గత పాలకులు ప్రజల్ని బంధించి, భయపెట్టి మరీ సమావేశాలు పెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చాకే ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. రాష్ట్ర ప్రజలందరికీ అవసరమైన రాజధాని అమరావతి గొడ్డలి పార్టీకి అవసరం లేదు. అందుకే ఇంకా రాజధానిపై కుట్రలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పుడు వేగంగా పనులు జరుగుతుంటే సహించలేకపోతున్నారు. గత పాలకుడు తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాలతో రాష్ట్రానికి రాజధానే లేకుండా పోయింది. మూడు రాజధానుల పేరిట గందరగోళ పరిచారు. ఎవరైనా పొరుగు రాష్ట్రాలకు వెళ్తే ఏపీకి మూడు రాజధానులా అని హేళనకు గురయ్యారు. పార్లమెంటులో శాశ్వత రాజధాని చట్టం చేస్తుంటే మావిగన్ అంటూ కొత్త ఆటలు మొదలు పెట్టారు. అమరావతి పరిరక్షణ కోసం అంటూ రౌడీలతో ఇప్పుడు దండయాత్ర చేస్తున్నారు. నిలకడలేని వ్యక్తులు రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్ని ఇబ్బందులు పెడుతున్నారు.

**హోంమంత్రిపై అవమానకర వ్యాఖ్యలు:** 'విజయవాడలో యువకుడి అదృశ్యం ఘటన నా దృష్టికి వస్తూనే సీఐను సస్పెండ్ చేశాం, చర్యలకు ఆదేశించాం. కానీ వైసీపీ నాయకులు కులాల మధ్య వివాదాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులతో విష ప్రచారం చేస్తున్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లతో ఆ పార్టీ నేతలు రెచ్చి పోతున్నారు. హోం మంత్రి అనిత మేకప్ పై ఆ పార్టీ నేతలు అసహ్యంగా, అవమానకరంగా మాట్లాడారు. మహిళా కమిషన్ ఈ అంశంపై గట్టిగా ప్రశ్నించినా ఆ పార్టీ నేతలు తమ వ్యాఖ్యల్ని సమర్థించుకుంటున్నారు. జగన్ సహకారం లేకపోతే ఆయన వెంట ఉన్న నేతలు విచ్చలవిడిగా మాట్లాడే పరిస్థితి ఉండదు. మా పార్టీలో ఈ తరహా మాట్లాడిన వారిని పార్టీ నుంచి బయటకు పంపించాం. మేం యజ్ఞంలా అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నేతలు రాక్షసుల్లా దానికి ఆటంకం కలిగిస్తున్నారు. నేరాలు చేసే పార్టీ, నేరస్తులను కాపాడే పార్టీ, నేరస్తులతో రాజకీయాలు చేసే పార్టీని ఇప్పుడే చూస్తున్నాం. అర్హత లేని వారిని అందలం ఎక్కిస్తే రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు సమస్యలు వస్తాయి. ఇలాంటి వ్యక్తులను జైల్లో పెట్టాలంటే ఒక్క నిముషం పని కానీ మేం ప్రతీ కార రాజకీయాలు చేయటం లేదు. మా దృష్టి అంతా రాష్ట్రం అభివృద్ధి కావాలని, తెలుగు వారిని అందలం ఎక్కించాలనే. రాష్ట్రంలో రౌడీయిజం చేయాలన్నదే వైసీపీ నేతల ఆలోచన. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అనే సంకల్పం ప్రజలు చేయాలని కోరుతున్నాను. ఎన్డీఏ అగైన్ అండ్ అగైన్ అన్నదే మన నినాదం కావాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుంది. నేరస్తులకు వంతపాడటం, నేరాలు చేయటం రాజకీయ పార్టీలకు తగదు. ఇలాంటి పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. అనంతరం ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల మహిళలు ప్రదర్శించిన అధునాతన కుట్టు మిషన్లను సీఎం తిలకించారు. ఆధునిక కుట్టు మిషన్ తో సీఎం చంద్రబాబు చిత్ర పటాన్ని అప్పటికప్పుడే తయారు చేసిన మహిళలు దానిని ముఖ్యమంత్రికి అందించారు. అ-రటి నారతో తయారు చేసిన వివిధ ఉత్పత్తులను చూసిన సీఎం డ్వాక్రా సంఘాల మహిళలను అభినందించారు. ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న ఉద్యాన పంటల ఉత్పత్తులు, మత్స్యకార బోట్లకు బిగించే ట్రాన్స్ పాండర్లను సీఎం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి. నారాయణ, ఎన్ఎండీ ఫరూఖ్, ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే సునీల్ కుమార్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు హాజరయ్యారు.

## ఏడుగురు దివ్యాంగులకు మోటరైజ్డ్ త్రిచక్ర వాహనాల పంపిణీ



- వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా అందజేత

**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్) :** వేమూరు నియోజకవర్గంలోని ఏడుగురు దివ్యాంగులకు ఒక్కోటి రూ. 1.07 లక్షల విలువైన ఉచిత రీట్రోఫిటెడ్ మోటరైజ్డ్ త్రిచక్ర వాహనాలను ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు బుధవారం పంపిణీ చేశారు. వేమూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం కింద ఈ వాహనాలను లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గం నుంచి మొత్తం 16 మంది దరఖాస్తు చేయగా, అర్హతల పరిశీలన అనంతరం ఏడుగురిని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఉచితంగా అందిస్తున్న మోటరైజ్డ్ త్రిచక్ర వాహనాలు విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, వ్యవసాయం తదితర అవసరాలకు ఉపయోగపడటంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని చెప్పారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో, స్వావలంబనతో జీవించేలా ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.

దివ్యాంగుల జీవితాల్లో ఆర్థిక, సామాజిక మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## హిందూ మతాన్ని బలహీనపరిచే కుట్రలో జగన్



- మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పించాలన్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ హిందూ మతాన్ని బలహీనపరిచే రాజకీయ కుట్రలో భాగమేనని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. బుధవారం అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు భారత రాజ్యాంగం అనుమతించదని స్పష్టం చేశారు. హిందూ మతం నుంచి ఇతర మతాల్లోకి మారిన వారికి రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, దీనిని భారతీయ జనతా పార్టీ వ్యతిరేకిస్తుందని తెలిపారు.

జగన్‌మోహన్‌రెడ్డి చేసిన డిమాండ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగానికి వ్యతిరేకమని మంత్రి పేర్కొన్నారు. క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తి ఎస్సీ హోదాను కోల్పోతారని న్యాయస్థానాలు స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బుధవారం జగన్ నిర్వహించిన మీడియా సమావేశం 'పాత సినిమా-కొత్త రిలీజ్'లాగా ఉందని వ్యాఖ్యానించిన ఆయన, గత ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చినా అదే అంశాలను మళ్లీ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రస్తావిస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రంలో 'రూల్ ఆఫ్ లా' అమలవుతోందని, అక్రమాలకు పాల్పడిన వారిలో మాత్రమే భయం ఉంటుందని మంత్రి అన్నారు. అమరావతి అంశంపై మళ్లీ వివాదాలు సృష్టించడం రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడదని, మూడు రాజధానుల అంశాన్ని మరోసారి తెరపైకి తేవడం ద్వారా జగన్ తన వైఖరిని మరోసారి బయటపెట్టారని విమర్శించారు. ప్రజలు అన్ని పరిణామాలను గమనిస్తున్నారని, అభివృద్ధి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే విధానాలకే మద్దతు ఇస్తారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో ఘనంగా డాక్టర్ బి.సి. రాయ్ జయంతి వేడుకలు



- కాంస్య విగ్రహావిష్కరణ.. 10 మంది వైద్యులకు సత్కారం

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్ ):** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ బి.సి. రాయ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన 10 మంది ప్రముఖ వైద్యులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఉపాధి కోసం కాకుండా మానవ సేవకు అంకితమైన అత్యున్నత వృత్తి అని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, టెలిమెడిసిన్ వంటి ఆధునిక సాంకేతికతలు అభివృద్ధి చెందినప్పటికీ వైద్యుడి మానవీయ స్పర్శ, క్లినికల్ నిర్ణయాలకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. సాంకేతికతను మానవత్వంతో మేళవించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్న ఆయన, కుప్పంలో విజయవంతంగా అమలవుతున్న 'సంజీవని' కార్యక్రమాన్ని వచ్చే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని వెల్లడించారు.

హైపర్ కమిటీ చైర్మన్ జస్టిస్ యూ. దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనదని కొనియాడారు. డాక్టర్ బి.సి. రాయ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో నిమగ్నమవుతున్న వైద్యులను అభినందించారు. వైద్యుల సమయానికి న్యాయవ్యవస్థ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్యుల సేవలకు సమాజంలో మరింత గౌరవం దక్కాలని, జాతీయ స్థాయి వైద్య పురస్కారాలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ పెద వీర్రాజు, డాక్టర్ జి. దేవ శంకరయ్య, డాక్టర్ డబ్ల్యూ. సీతారామ్, డాక్టర్ జి. ఈశ్వర్, డాక్టర్ ఇండ్లా రామసుబ్బారెడ్డి, డాక్టర్ టి. మురళీమోహన్, డాక్టర్ పి. మురళీకృష్ణ, డాక్టర్ పింగళి ఆనంద్ కుమార్, డాక్టర్ కె.ఎం.డి.ఎఫ్. రహిమాన్ సిద్ధిఖీ, డాక్టర్ ఎం. సత్యవల్లిలకు పురస్కారాలు అందజేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్, అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు, పురస్కార గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తెలుగు అకాడమీపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

- వ్యాఖ్యలు ఉపసంహరించుకోకపోతే పరువునష్టం, అట్రాసిటీ కేసులు: ఆర్.డి. విల్సన్
- తెలుగు, సంస్కృత అకాడమీపై లక్ష్మీ పార్వతి చేసిన ఆరోపణలను ఖండించిన చైర్మన్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** తెలుగు, సంస్కృత అకాడమీపై మాజీ అధ్యక్షురాలు లక్ష్మీ పార్వతి చేసిన ఆరోపణలను అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ (శరత్ చంద్ర) తీవ్రంగా ఖండించారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అకాడమీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తమ హయాంలో అన్ని పనులను ఓపెన్ టెండర్ల ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, లక్ష్మీ పార్వతి హయాంలో జరిగిన వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 2022లో అకాడమీ ఆదాయం సుమారు రూ. కోటి ఉండగా, 2024-25 నాటికి అది రూ. 25 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు.

అకాడమీ పేరుతో ప్రచారం చేస్తున్న యూట్యూబ్ ఛానల్, వర్చువల్ అకాడమీ అంశాలపై వస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని విల్సన్ తెలిపారు. సమాచార సాంకేతికతను వినియోగించి ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో మాత్రమే ప్రతిపాదనలు సిద్ధం చేశామని, వాటికి అకాడమీ నిధులు ఖర్చు చేయలేదన్నారు. వి.జి.ఎస్. పేరుతో వెలుగులోకి వచ్చిన పీడీఎఫ్ వ్యవహారంలో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశామని, దర్యాప్తు సంస్థల నివేదికలను ప్రశ్నించడం సరికాదన్నారు. అకాడమీ అభివృద్ధే తమ లక్ష్యమని, తెలంగాణ నుంచి రావాల్సిన నిధుల సాధనతో పాటు అకాడమీ ప్రచురణలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

లక్ష్మీ పార్వతి వ్యక్తిగత విమర్శలు, ఏకవచన ప్రయోగాలు అభ్యంతరకరమని విల్సన్ అన్నారు. అకాడమీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే పరువునష్టం దావాతో పాటు అట్రాసిటీ చట్టం కింద కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జీఎస్టీ ప్రజలపై భారం కాదు

- సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ అరుణ్ రిచర్డ్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** జీఎస్టీ అనేది ప్రజలపై భారం కాదని, అది మన సామూహిక భవిష్యత్ కోసం చేసే పెట్టుబడి అని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్ అన్నారు. మంగళవారం రింగ్ రోడ్డు లోని శుభం కన్వెన్షన్ హాలు లో జరిగిన తొమ్మిదవ జీఎస్టీ దినోత్సవ వేడుకలో ఆయన ముఖ్య అతిథి గా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ్ రిచర్డ్ మాట్లాడుతూ... ప్రతి పన్ను చెల్లింపు దేశ మౌలిక సదుపాయాలు, వైద్యం, విద్య మరియు ప్రభుత్వ సేవల మెరుగుదలకు దోహద పడుతుందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలందించడం, వారి సమస్యల పరిష్కారం, స్వచ్ఛందంగా పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించడం మరియు వ్యాపార అభివృద్ధికి తోడ్పడేలా సాంకేతికను వినియోగించుకోవడంలో గుంటూరు కమిషనరేట్ జీఎస్టీ బృందం నిరంతరం కృషి చేస్తుందని వివరించారు. 'సుగమ కర్ వ్యవస్థ, సశక్త భరత్ ' ( సరళమైన పన్ను వ్యవస్థ, శక్తివంతమైన భారతం ) అనే ఇతివృత్తం తో ఈ ఏడాది జీఎస్టీ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. పన్ను చెల్లింపుదారులకు పారదర్శకమైన, సాంకేతికత తో కూడిన అనుకూలమైన పన్ను పరిపాలన అందించాలనే ప్రభుత్వ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. భారతదేశపు అత్యంత పరివర్తనాత్మక ఆర్థిక సంస్కరణలలో వస్తు సేవల పన్ను అగ్రగామి గా నిలుస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు భాస్కరరెడ్డి వేమిరెడ్డి, విజయవాడ కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనర్ ఆర్. కె. రామన్, గుంటూరు రైల్వే డివిజన్ మేనేజర్ సుదేశ్న సేన్, సెంట్రల్ జీఎస్టీ అప్పీల్ కమిషనర్ దేవేష్ గుప్తా, సీనియర్ అధికారులు, సిబ్బంది, వాణిజ్య మరియు పారిశ్రామిక ప్రతినిధులు, పన్ను నిపుణులు, ఇతర వాటదారులు పాల్గొన్నారు. సరళమైన, పారదర్శకమైన మరియు సమర్థవంతమైన జీఎస్టీ వ్యవస్థ ద్వారా ' వికసిత్ భారత్ ' లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేస్తామని వారు పునరుద్ఘాటించారు.

## కిమిడి కళావెంకటరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పోలాకి శ్రీనివాసరావు

- విశాఖపట్నంలో కలిసి అభినందించిన రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ అతిథి గృహంలో పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, కళావెంకటరావు ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యుడు రావాడ సీతారామ్, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు కోడిగుడ్ల రవికుమార్ తదితరులు పాల్గొని కిమిడి కళావెంకటరావును అభినందించారు. ఆయన రాజకీయ, ప్రజాసేవా ప్రస్థానం మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలు ఆత్మీయ వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు కిమిడి కళావెంకటరావుతో కొద్దిసేపు భేటీ అయి రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.

## చిన్నారిని చంపిన వారికి ఉరిశిక్ష వేయాలి



**లింగాల (జర్నలిస్ట్ ఫైల్):** నాలుగు ఏళ్ల బాలిక నిత్వికది దురహంకార హత్యేనని, ఆ చిన్నారిని చంపిన వారికి ఉరిశిక్ష వేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర తాజా మాజీ అధ్యక్షులు పావులూరి హనుమంతరావు డిమాండ్ చేశారు. లింగాల మండలం లోపట్నూతల గ్రామంలో ఇటీవల నిత్విక దారుణ హత్యకు గురి కాగా, బాధిత కుటుంబాన్ని మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పరామర్శించారు. మృతురాలు నిత్విక చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిత్విక తల్లిదండ్రులైన రామాచారి, సృజన దంపతులతో మాట్లాడి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి విశ్వబ్రాహ్మణ సంఘం తరఫున తక్షణ సాయంగా రూ. 50 వేలు అందజేశారు. రామాచారి కుమారుడు లక్కీ విద్యాభ్యాసానికి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని బాధితులకు భరోసా కల్పించారు. నిందితులకు శిక్ష పడే వరకు పోరాడుతామని హామీ ఇచ్చారు.

**బాధిత కుటుంబంపై బైండోవర్ కేసులు ఎత్తివేయాలి :** అనంతరం పావులూరి హనుమంతరావు మీడియాతో మాట్లాడుతూ గత కొంత కాలంగా రామాచారి దంపతులు, వారి పిల్లలపై పక్కంటి వారైన వెంకట్రామిరెడ్డి కుటుంబీకులు దాడులు, దౌర్జన్యాలు చేశారని తెలిపారు. ఈ విషయాలపై రామాచారి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. అయినా పోలీసులు సరైన రీతిలో స్పందించలేదన్నారు. రామాచారిపైనే కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పడం వల్ల రామాచారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని వెంకట్రామిరెడ్డి భార్య స్వాతి.. చిన్నారి నిత్వికను హత్య చేయడానికి తెగించారన్నారు. అభం శుభం తెలియని చిన్నారిని ప్లాస్టిక్ నీళ్ల డ్రమ్ములో ముంచి, చంపడం దారుణమన్నారు. పోలీసులు కూడా తమను ఏమి చేయలేరన్న ధైర్యంతో ఈ అఘాయిత్యానికి పాల్పడిందని ఆరోపించారు. బాధిత కుటుంబానికి, సాక్షులకు పోలీస్ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రామాచారి కుటుంబంపై ఉన్న బైండోవర్ కేసులు ఎత్తివేయాలని కోరారు. వెంకట్రామిరెడ్డి కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం**

కక్షలు, కార్పణ్యాలు పిల్లల మీద చూపడం, వారిని చంపడం దుర్మార్గమని తెలిపారు. ఆర్థిక బలం, అంగబలం, కండ బలం, ధన బలం ఉన్న వాళ్లకు ఒక రకంగా.. పేదలను మరో రకంగా పోలీసులు చూడటం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు తక్షణమే స్పందించాల్సినటువంటి అవసరం ప్రభుత్వంపై ఉన్నదని తెలిపారు. ఎంతో జీవితం ఉన్న చిన్నారి చనిపోవడం రామాచారి కుటుంబానికి తీరని లోటని అన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో.. చిన్నారి మృతికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రామాచారిది నిరుపేద కుటుంబం అని, రోజూ పని చేస్తేనే పూట గడిచేదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారి, నాయకులు పులివెందులకు చెందిన నాగభూషణం ఆచారి, రత్నమాచారి, ఉత్తరాది సోమాచారి కడపకు చెందిన నెమ్మికంటి వీరబ్రహ్మం, వడ్లమాని జగదీష్ డాక్టర్ ఎస్‌ఏ సెల్వం తదితరులు పాల్గొన్నారు.

## బస్వాపురం ఆర్ & ఆర్ నిధుల విడుదల చేయాలి

- భువనగిరి నియోజకవర్గ సమస్యలపై సీఎంకి ఎమ్మెల్యే కుంభం వినతి పత్రం



**యాదాద్రి భువనగిరి, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :** బస్వాపురం ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్&ఆర్ ప్యాకేజీ కింద పెండింగ్‌లో ఉన్న పరిహార నిధులను తక్షణమే విడుదల చేసి , నిర్వాసిత కుటుంబాలకు న్యాయం చేయాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించిన సిఎం త్వరలో నిధులు విడుదల చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే రంగారెడ్డి జిల్లా బందరావిరాల వద్ద ఉన్న డంపింగ్ యార్డు ప్రభావం పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామ శివారుపై పడుతున్నందున , ప్రజల ఆరోగ్యం , పర్యావరణ పరి రక్షణను దృష్టిలో ఉంచు కుని డంపింగ్ యార్డును అక్కడి నుంచి తొలగించేలా చర్యలు చేపట్టాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎమ్మెల్యే తో పాటు ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య పాల్గొన్నారు.

## స్త్రీ నిధి అక్రమాలపై స్వతంత్ర విచారణ జరపాలి

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి..
- మాజీ వివోఏ అమరారపు సైదులు..



**గరిడేపల్లి, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :** గరిడేపల్లి మండలం కల్మలచెరువు గ్రామ సంఘ బంధం - 1 పరిధిలోని స్త్రీ నిధి లావాదేవీల్లో జరిగిన అక్రమాలపై స్వతంత్ర విచారణ చేపట్టాలని మాజీ వివోఏ, అంతర్జాతీయ పారా వాలీబాల్ క్రీడాకారుడు అమరారపు సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్త్రీ నిధి బకాయిలు వసూలు చేసే విషయంలో అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. 2022 నుంచి 2024 వరకు అధికారులు నిర్వహించిన తనిఖీలు సంఘ సభ్యులు, నాయకులతో మాట్లాడకుండా కార్యాలయ స్థాయిలోనే ముగించాలని తెలిపారు. సంఘ సభ్యులు చెల్లించిన సుమారు 2 లక్షల 85 వేలు నిధులను సంబంధిత సంఘాలకు సమాచారం ఇవ్వకుండా తిరిగి పంపించారని తెలిపారు. ఒక లక్ష 66 వేల రూపాయల లావాదేవులపై ఇప్పటికి స్పష్టత లేదని పేర్కొన్నారు. తాను సెలవుల్లో ఉన్న సమయంలో జరిగిన పరిణామాలకు బాధ్యుడిగా చేస్తూ ఒత్తిడి తెచ్చి పత్రాలపై సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. అనంతరం 2024 ఆగస్టు 29న తాను బాధ్యత నుంచి తప్పుకుని రాజీనామా చేశానని తెలిపారు. తాను సెలవలపై వెళ్లిన సమయంలో స్త్రీ నిధి ఖాతాలో అవకతవకలు జరిగినట్లు వాటిని గుర్తించినట్లు సైదులు పేర్కొన్నారు. కల్మల చెరువు సంఘ బంధం - 1 లావాదేవీలపై స్వతంత్ర విచారణ నిర్వహించి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న దేవరకద్ర శాసన సభ్యులు జీఎమ్ఆర్

- వీడియో కాన్ఫిరెన్స్‌లో రైతులతో మాట్లాడిన మంత్రి తుమ్మల...



**దేవరకద్ర, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండలం, అమడబాకుల గ్రామంలో రైతు వేదికలో రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న దేవరకద్ర శాసన సభ్యులు జీఎమ్ఆర్.. రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులను హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి శ్రీ. రేవంత్ రెడ్డి సహచర మంత్రులతో కలిసి రైతు భరోసా నిధులు విడుదల చేశారు, ఈ సందర్భంగా అమడబాకుల గ్రామంలోని రైతు వేదిక లో స్థానిక నాయకులు, రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి,మునిసిపల్ చైర్మెన్ అరుణ శ్రీనివాస్,మార్కెట్ చైర్మన్ పల్లెపగా ప్రశాంత్,మునిసిపల్ వైస్ చైర్మన్ పల్లవి కృష్ణారెడ్డి, సీఐ,ఇతర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఇంటింటి సర్వేను బూత్ లెవెల్ అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. మంగళవారం గద్వాల పట్టణంలోని 21వ వార్డు పరిధిలోని 233, 234 పోలింగ్ స్టేషన్లలో జరుగుతున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలతో మాట్లాడుతూ ప్రతిరోజూ తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించేలా ప్రణాళిక రూపొందించుకుని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఓటర్లకు అందజేసే ఎన్యూమరేషన్ ఫారాలను ముందుగా స్కాన్ చేసిన అనంతరమే పంపిణీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫారాలను సక్రమంగా పూరించడంలో బూత్ లెవెల్ ఏజెంట్లు, స్థానిక యువత ఓటర్లకు సహకరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ పలు ఇండ్లను సందర్శించి ఓటర్లకు స్వయంగా ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి, వాటిని సక్రమంగా పూరించి బీఎల్ఓలకు అందించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్, గద్వాల తహసీల్దార్ హరికృష్ణ, సూపర్వైజర్ వెంకటేశ్వర్ రెడ్డి, బీఎల్ఓ శాంతమ్మ, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## బస్వాపురం పూర్వ విద్యార్థుల ఉదారత...

- చిన్నారుల భవిష్యత్తుకు ఆర్థిక సాయం
- విద్యార్థులను అభినందించిన టీచర్లు గ్రామ ప్రజలు



**యాదాద్రి భువనగిరి, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2012-13 వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మానవత్వంతో తల్లి లేని చిన్నారులకు ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం ముత్తిరెడ్డి గూడెంకు చెందిన గంగాదేవి జ్యోతి ఇటీవల మృతి చెందారు. ఆమెకు కుమార్తె నందిత, కుమారుడు ఉన్నారు. తల్లి మరణంతో చిన్నారులు అనాథలైనారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బస్వాపురం గ్రామంలో 2012,13 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు నందిత పేరుమీద పోస్టాఫీస్ లో కిసాన్ వికాస్ పత్రం (కే వీ పీ) కింద రూ.70 వేల రూపాయల స్థిర పెట్టుబడి (ఎఫ్ డీ) చేశారు. ఈ ఆర్థిక సాయం ద్వారా భవిష్యత్తులో నందిత ఉన్నత చదువులకు ఉపయోగపడుతుందని విద్యార్థులు అన్నారు. ఈ సందర్భంగా 2012,13 పదవ తరగతి చదివిన విద్యార్థులను పాఠశాల

# అత్యాధునిక విధానంలో గంజాయి నిర్వీర్యం..

- పర్యావరణానికి హాని లేకుండా 735 కేజీల గంజాయి ధ్వంసం





**యాదాద్రి భువనగిరి జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :** జి.ఆర్.పి సికింద్రాబాద్ జిల్లా స్పెషల్ డ్రైవ్ లో స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలు , సైకోట్రోఫిక్ పదార్థాలను పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న 735 కేజీల గంజాయిని మంగళవారం రోజు ఐజిపి రైల్వేస్ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో రోమా ఇండస్ట్రీస్ తుక్కపురం గ్రామంలో నిర్వీర్యం చేయడం జరిగింది. వీటి విలువ సుమారు 3.22 కోట్లు. రైల్వే పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వం కోర్టు ఉత్తర్వుల మేరకు యాదాద్రి జిల్లా తుక్కాపుర్ గ్రామంలో గల రోమా ఇండస్ట్రీస్ నందు యాజమాన్యం , సిబ్బంది సహాయంతో ప్రభుత్వ సాక్షుల సమక్షంలో గంజాయిని బూడిద చేయడం జరిగిందని వెల్లడించారు. పర్యావరణ రక్షణ , ప్రజా ఆరోగ్యానికి ఎలాంటి హాని కలగకుండా అత్యాధునిక సాధనాలతో జాగ్రత్తలు తీసుకుని నిర్వీర్యం చేశాం. ధ్వంసం చేసిన గంజాయి విలువ 3 కోట్ల 22 లక్షలు ఉంటుందని పోలీస్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సందీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ , గంజాయి వినియో గించడం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతోంది. డ్రగ్స్ రవాణా , వినియోగం నేరం. గంజాయి నివారణలో జిల్లా పోలీసు కృషి చేస్తోంది. డ్రగ్స్ అమ్మకం , రవాణా , విని యోగం పై సమాచారం ఉంటే డయల్ 100 , 112 , 1908కు తెలియజేయాలని సూచించారు. డ్రగ్స్ , గంజాయి వినియోగించే వారిని , వ్యాపారం చేసే వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్నామని , తల్లి దండ్రులు పిల్లల అలవాట్ల ను గమనిస్తూ చెడు వ్యస నాలకు లోను కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే జిల్లా సికింద్రాబాద్ డ్రాగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ గోనె సందీప్ కుమార్ ఐపిఎస్ , న్యూడల్ అధికారి డిఎస్పీ జావేద్ , సికింద్రాబాద్ , కాజీపేట డిఎస్ఆర్పిలు కే. శ్రీనివాస రావు పాల్గొన్నగా గోడ్బెయ్య ద్వారా విధ్వంసక ఆర్య కళాపాల ప్రక్రియ ప్రకారం ఫోటోలు వీడియోలు తీయబడినవి. ఆర్. ఎల్లప్ప హైదరాబాద్ , బి. ప్రవీణ్ కుమార్ , ఐఎస్.ఆర్.పి హైదరాబాద్ లైన్ ఏ. శ్రీనివాస్ , కాజీపేట లైన్ వి. నరేష్ , వరంగల్ లైన్ పి. సురేందర్ , ఖమ్మం లైన్ ఎం. శ్రీనివాస్ , కే. రమేష్ నాయుడు ఐపీఎస్ , ఐజిపి రైల్వే రోడ్డు భద్రత సిబ్బంది పాల్గొన్నారు.

# "నల్లగొండను తక్కువ అంచనా వేయొద్దు"..

- సీఎం వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఫైర్
- "జగదీశ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులను తొక్కుతాననడం అహంకారానికి నిదర్శనం..
- ఉద్యమాల గడ్డను అవమానిస్తే ప్రజలే గట్టి సమాధానం చెబుతారు"
- "కేసీఆర్ పాలనలో అత్యధిక వరి పండించిన జిల్లా నల్లగొండ.. తెలంగాణ విమోచన, రాష్ట్ర సాధన పోరాటాలకు ఊపిరిగా నిలిచిన నేలను కించపరచడం సిగ్గుచేటు"



**ఆలేరు, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్న నేపథ్యంలో, మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఘాటుగా స్పందించారు. నల్లగొండ జిల్లా చరిత్రను, రైతుల ఆత్మగౌరవాన్ని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కించపరిచేలా మాట్లాడటం ముఖ్యమంత్రి పదవికి తగదని ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, "నల్లగొండ జిల్లా అంటే కేవలం ఒక జిల్లా కాదు.. తెలంగాణ చరిత్రను తిరగరాసిన ఉద్యమాల గడ్డ. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటానికి అగ్రభాగాన నిలిచి తెలంగాణ విమోచనకు బాటలు వేసిన వీరుల నేల నల్లగొండ. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రతి గ్రామం ఉద్యమ కేంద్రంగా మారి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించింది" అని పేర్కొన్నారు."తెలంగాణ కోసం తొలి అమరుడిగా ప్రాణత్యాగం చేసిన శ్రీకాంత్ చారి జన్మించిన పవిత్ర నేల నల్లగొండ. ఎందరో ఉద్యమకారులు, రైతు నాయకులు, ప్రజానాయకులను అందించిన చారిత్రక గడ్డను అవమానించడం దురదృష్టకరం. నల్లగొండ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు ప్రజలు ఎప్పటికీ సహించరు" అని అన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే అత్యధిక వరి ఉత్పత్తి సాధించి రైతు శక్తిని చాటిందని ఆమె గుర్తు చేశారు. రైతులకు సాగునీరు, విద్యుత్, పెట్టుబడి సాయం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాల ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. రైతుల చెమటతో నిలిచిన జిల్లాను కించపరిచే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "జగదీశ్ రెడ్డిని, బీఆర్ఎస్ నాయకులను తొక్కుతానంటూ మాట్లాడటం అధికార అహంకారానికి పరాకాష్ట. అధికారంలో ఉన్నాననే మదంతో ప్రతిపక్ష నాయకులను బెదిరించే భాష ప్రజాస్వామ్య వ్యవస్థలో చెల్లదు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తికి తగదు" అని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించిన ఆమె, రైతుల సమస్యలు, నిరుద్యోగుల ఉద్యోగాలు, మహిళలకు ఇచ్చిన గ్యారంటీలు, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేస్తోందని విమర్శించారు.

ఈ సందర్భంగా గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, "నిజాం నిరంకుశ పాలనకు ఎదిరించి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి తెలంగాణ విమోచనకు బాటలు వేసిన వీరుల గడ్డ నల్లగొండ జిల్లా. అన్యాయాన్ని ఎదిరించడం, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం నల్లగొండ నేల స్వభావం. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి దిక్సూచిగా నిలిచిన ఈ జిల్లా, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించింది. తెలంగాణ కోసం తొలి అమరుడిగా ప్రాణత్యాగం చేసిన శ్రీకాంత్ చారి జన్మించిన పవిత్ర నేల నల్లగొండ. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి వంటి నాయకులు ఈ జిల్లా గర్వకారణం. అలాంటి నాయకులను, ఉద్యమాల గడ్డను అవమానించేలా మాట్లాడటం ముఖ్యమంత్రి పదవికి ఏమాత్రం తగదు" అని తీవ్రంగా విమర్శించారు.ఇంకా మాట్లాడుతూ, "నల్లగొండ జిల్లాను ఎవరూ తక్కువ అంచనా వేయవద్దు. ఇది ఉద్యమాలకు పురిటిగడ్డ.. రైతాంగ పోరాటాలకు చిరునామా.. ఆత్మగౌరవానికి ప్రతీక. అధికార అహంకారంతో 'తొక్కుతా' అని మాట్లాడటం ప్రజాస్వామ్య సంస్కృతి కాదు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, రైతులు, నిరుద్యోగులు, మహిళల సమస్యలను గాలికొదిలేసి ప్రతిపక్షాలపై వ్యక్తిగత దూషణలకు దిగడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నమే. నల్లగొండ జిల్లా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రతి వ్యాఖ్యకు ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా గట్టి సమాధానం చెబుతారు. పదవులు శాశ్వతం కావు.. కానీ ప్రజల తీర్పు శాశ్వతం" అని ఘాటుగా హెచ్చరించారు.చివరగా ఆమె, ప్రజాస్వామ్యంలో అధికారాలు శాశ్వతం కావని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న వారే చరిత్రలో నిలుస్తారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలను అవమానించడం కంటే ప్రజల సమస్యల పరిష్కారం, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి, ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు.

# గురుకుల విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను సందర్శించిన బీజేవైఎం నాయకులు
- పక్కా భవనం నిర్మించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్




**ఆలేరు, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆలేరు ప్రభుత్వ బాలుర బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థులు సరైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ, వారికి శాశ్వత పాఠశాల భవనం నిర్మించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మంగళవారం బీజేవైఎం నాయకుల బృందంతో కలిసి ఆలేరులోని బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చిన కథనాల నేపథ్యంలో పాఠశాల పరిస్థితులను పరిశీలించడంతో పాటు, పాఠశాల ప్రిన్సిపాల్‌ను కలిసి వాస్తవ పరిస్థితులపై ఆరా తీశారు.ఈ సందర్భంగా దయ్యాల కుమారస్వామి మాట్లాడుతూ, వందలాది మంది విద్యార్థులు ఇప్పటికీ అద్దె భవనంలోనే విద్యాభ్యాసం కొనసాగించడం విచారకరమన్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, వసతి గదులు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం వంటి ప్రాథమిక అవసరాలు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని ఆరోపించారు.రాత్రి వేళల్లో వాష్‌రూమ్‌కు వెళ్లాలంటే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పై అంతస్తులో నీటి సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు బాలికల వసతి గృహంలో స్వల్ప వర్షానికే నీరు నిలిచి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై విమర్శలు చేసిన దయ్యాల కుమారస్వామి, తాను బడుగు, బలహీన వర్గాల నాయకుడినని చెప్పుకునే ప్రజాప్రతినిధి, అదే వర్గానికి చెందిన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల సంక్షేమం మాటల్లో కాకుండా చేతల్లో కనిపించాలని, వెంటనే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కమిటీకారి కృష్ణ, సీనియర్ నాయకులు చిరిగి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ బొట్ల సంపత్, ప్రధాన కార్యదర్శులు వెలగల వెంకటేష్, నరేందర్, మహేందర్, యువమోర్చా నాయకులు కంతుల శంకర్, గుర్రం ప్రవీణ్ రెడ్డి, సుదగాని ఉదయ్ కిరణ్, బండి మహేష్, రావుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం చేయాలి

- సిల్క్‌నగర్‌లో ఓటర్ ఫారాల పంపిణీ, అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్
- ఓటర్ల వివరాలను పరిశీలించి ఫారాలు సకాలంలో సమర్పించాలని సూచన



**ఆలేరు, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి బీజన బాలమణి భాస్కర్ పిలుపునిచ్చారు.మంగళవారం ఆలేరు పట్టణంలోని 7వ వార్డు పరిధిలోని సిల్క్‌నగర్ కాలనీలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో నమోదైన ఓటర్లకు ఫారాల పంపిణీతో పాటు అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటు ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో సక్రమంగా ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నా లేదా మార్పులు అవసరమైనా సంబంధిత ఫారాలను నింపి సకాలంలో సమర్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, బీఎల్‌వోలు, బీఎల్ఏలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడంతో పాటు, అనర్హుల పేర్లు, తప్పులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, 9వ వార్డు కౌన్సిలర్ పస్తం ఆంజనేయులు, స్థానిక బీఎల్‌వో, కాంగ్రెస్ పార్టీ వార్డు బీఎల్ఏ తాళ్లపల్లి మహేష్, స్థానిక నాయకులు చింతపల్లి సిద్ధులు, చింతకింది రంగ, ఎండీ మునీర్, చింతకింది గిరి, సిల్క్‌నగర్ కాలనీవాసులు, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ప్రజలు ఉత్సాహంగా ఫారాలను స్వీకరించి, ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియకు సహకరిస్తామని తెలిపారు.

# అనాధ పిల్లలని ఆదుకొని..సమాజ సేవలు చెయ్యండి..

- పోత్నక్ ప్రమోద్ కుమార్.



**యాదాద్రి భువనగిరి, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని గ్రేస్ చిల్డ్రన్ హోమ్ టీచర్స్ కాలనీ లో 2026-2027 నూతన సంవత్సర సందర్భంగా నిర్వాహకులు జాన్ ప్రసాద్ ఆధ్వర్యంలో అనాధ పిల్లలకు ఏడాదికి సరిపడా నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ , 8 వార్డు కౌన్సిలర్ షేక్ మదర్ పేష బబుల్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ కన్న పిల్లలని కన్నవారే చూసుకోవడం కష్టమైన ఈరోజుల్లో అనాధ పిల్లల్ని అక్కున చేర్చుకున్న గ్రేస్ చిల్డ్రన్ హోమ్ జాన్ ప్రసాద్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఇలాంటి సేవలు మరెన్నో చేయాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరు కుంటున్నాను. ఒక పూట అన్నం పెడితే ఆ ఒకరోజే గుర్తుంటాం..కానీ అనాధ పిల్లలని ఆదుకుంటే జీవితంలో వాళ్ళు జాన్ ప్రసాద్ను గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోతారు. మీతో పాటు మరి కొందరు సామాజిక వేత్తలు ముందుకు రావాలని అందుకు తన వంతు సహకారాన్ని అందిస్తామని ప్రమోద్ కుమార్ తెలిపారు. అలాగే పాస్టర్ రుపాస్ అనాధ పిల్లలకు బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సమాజంలో అనాధ పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థాయిలకు ఎదగాలని , ప్రభుత్వ పరంగా అనాధ పిల్లల్ని ఆదుకుంటామని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రూపస్ , పాలడుగు శేఖర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం - సేవే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు



**భద్రాచలం (జర్నలిస్ట్ ఫైల్) :** వెంకటాపురం మండలం, సుదిబాక గ్రామానికి చెందిన 28 ఏళ్ల యువకుడు మడప భాస్కర్ విద్యుత్ షాక్‌కు గుర్రై శరీరంలో సుమారు 60 శాతం వరకు తీవ్ర కాలిన గాయాలతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. ప్రాణాలు కాపాడుకోవడానికి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించగా, సుమారు రూ.20 నుండి రూ.30 లక్షల వరకు ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఈ కుటుంబం చికిత్స కోసం తమ పొలాలను కూడా విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక చికిత్స కొనసాగించే స్తోమత లేక తీవ్ర ఆవేదనలో ఉన్న కుటుంబ సభ్యులు భద్రాచలం ఎమ్మెల్యే, ఎంఎస్ జనరల్ సర్జన్ డాక్టర్ తెల్లం వెంకటరావు ని ఆశ్రయించారు. వారి పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, రోగిని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోని భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చేర్పించి అవసరమైన వైద్య సేవలను అందించేలా చర్యలు చేపట్టారు.ఆసుపత్రిలో జనరల్ సర్జన్ అందుబాటులో లేని పరిస్థితుల్లో, స్వయంగా జనరల్ సర్జన్ అయిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు నాలుగు నుంచి ఐదు గంటలపాటు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలో పాలొని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ బి. దేవరాజ్ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ తాటి మల్లేష్, డాక్టర్ నికిత, డాక్టర్ కౌండిన్య, నర్సింగ్ సిబ్బంది, అనస్థీషియా బృందం, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సమిష్టిగా కృషి చేశారు.ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వై. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి క్లిష్టమైన కేసుకు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు స్వయంగా శస్త్రచికిత్స చేయడం అభినందనీయమని, ఆయన సేవాభావం ప్రభుత్వ వైద్య సేవల పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం మెరుగు పడుతూ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.రోగి తల్లిదండ్రులు మాట్లాడుతూ "చికిత్స కోసం మా ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇక మాకు దారి కనిపించని సమయంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు, భద్రాచలం ఏరియా ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మా బిడ్డకు కొత్త జీవితం ఇచ్చారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాం " అని భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందించగల సామర్థ్యం ఉందని, భద్రాచలం ఏరియా ఆసుపత్రి మరోసారి నిరూపించిందని స్థానిక ప్రజలు అభినం దిస్తున్నారు.

# పదవీ విరమణ పొందిన మున్సిపల్ ఉద్యోగులకు సన్మానం



**ఖమ్మం, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తూ మంగళవారం పదవీ విరమణ పొందిన నర్రా గురవయ్య (శానిటరీ జవాన్), పి. అబ్బు రాములు (డ్రైవర్)లను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఘనంగా సన్మానించారు. అదే సందర్భంగా పదవీ విరమణ పొందిన భాస్కర్ (వాచ్‌మెన్)కు కమిషనర్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌కు వారు ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో అందించిన సేవలను కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా, ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# గోధుమవాగు బ్రిడ్జీపై గుంతల మరమ్మత్తులు ముమ్మరం

**కొత్తగూడెం, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
కొత్తగూడెం పట్టణ పరిధిలోని రామవరం గోధుమవాగు బ్రిడ్జీపై ఏర్పడిన గుంతల మరమ్మత్తులు ముమ్మరంగా సాగుతున్నాయని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. కొత్తగూడెం పరిధిలోని రామవరం గోధుమవాగు బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతోపాటు తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో మున్సిపల్ శాఖ ద్వారా మరమ్మత్తు పనులకు ఆదేశించారు. ఈ మేరకు మేయర్ మూడ్ గణేష్ మంగళవారం అక్కడ జరుగుతున్న మరమ్మత్తు పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జీపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి నిత్యం ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నా నేషనల్ హైవే అధికారులు ఘోరంగా నిర్లక్ష్యం వహిస్తున్నారని, తమ భాధ్యతను విస్మరించారని అన్నారు. యేండ్ల తరబడి ఈ దుస్థితి నెలకొనడం వల్లే తాము రంగంలోకి దిగాల్సి వచ్చిందని, ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన ఈ మరమ్మతు పనులకు ఆదేశించామని స్పష్టం చేశారు. వాహనదారులకు ఇకపై ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను అత్యంత నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా



పూర్తి చేయాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. మేయర్ వెంట కార్పొరేటర్లు కార్పొరేటర్లు బోయిన విజయ్ కుమార్, కూరపాటి సుధాకర్, జి వెంకటేశ్వర్లు, నాయకులు ఎండి యూసుఫ్, ధర్మరాజు, పి సత్యనారాయణాచారి తదితరులు వున్నారు.

# కేపీహెచ్‌బీ ఫేజ్-15లో అక్రమ షెడ్ నిర్మాణంపై స్థానికుల ఆందోళన

## - అధికారుల విచారణకు డిమాండ్



**కూకట్‌పల్లి, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
కేపీహెచ్‌బీ ఫేజ్-15లోని ది జంగిల్ బుక్ పార్క్ సమీపంలో నిర్మిస్తున్న భారీ షెడ్‌పై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే నిర్మాణం జరుగుతోందని ఆరోపిస్తూ, వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులు స్థలాన్ని పరిశీలించాలని వారు కోరుతున్నారు.ప్రధాన రహదారి పక్కనే నిర్మిస్తున్న ఈ షెడ్ కారణంగా డ్రైనేజీ, రహదారి వినియోగం, ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణానికి అవసరమైన అనుమతులు, భవన నిబంధనల అమలుపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, ఏవైనా ఉల్లంఘనలు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమం పూర్తయ్యే వరకు ప్రజలకు బిఆర్ ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం

## - ఖానాపురం హవేలీ ఇన్‌చార్జి, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్

**ఖమ్మం, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఖమ్మం నియోజక వర్గంలోని ఖానాపురం హవేలీ ప్రాంతంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని మంగళవారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఖానాపురం హవేలీ ఇన్‌చార్జి, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓ లు) ను కలిసి, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ విధానం, ఇప్పటివరకు పంపిణీ చేసిన శాతం, ఇంకా పంపిణీ చేయాల్సిన ఫారాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.అదేవిధంగా, ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎన్యూమరేషన్ ఫారం తో పాటు అవసరమైన సందర్భాల్లో ఉపయోగించే ఫారం -6 (కొత్త ఓటరు నమోదు), ఫారం -7 (ఓటరు పేరును తొలగించేందుకు), ఫారం -8 (ఓటరు వివరాల సవరణ, మార్పులు చేయడానికి) దరఖాస్తులపై కూడా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, అవసరమైన వారికి వాటిని నింపడంలో సహకరించాలని సూచించారు.ఎస్ఐఆర్ కార్యక్రమం పూర్తయ్యే వరకు బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓ లు) నిర్వహించే విధుల్లో వారికి అన్ని విధాలా సహకారం అందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఫారాలు నింపడంలో అవగాహన లేని కుటుంబాలకు దగ్గరుండి సహాయం చేయడంతో పాటు, అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు.ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటు అత్యంత విలువైన హక్కు అని, ఆ హక్కును పరిరక్షించడం రాజకీయ పార్టీల బాధ్యత అని పేర్కొన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఖమ్మం నియోజక వర్గంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు ప్రస్తుతం ఎస్ఐఆర్ కార్యక్రమంపైనే పూర్తి స్థాయిలో దృష్టి సారించి ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. అవసరమైన పత్రాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి మీ సేవ ద్వారా అవసరమైన డాక్యుమెంట్లు దరఖాస్తు చేయించేందుకు కూడా పార్టీ నాయకులు





సహకరిస్తారని చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఏవైనా సమస్యలు, అవకతవకలు లేదా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు కనిపిస్తే వెంటనే స్థానిక బీఆర్ఎస్ నాయకులు లేదా బీఎల్‌ఏలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. అలాంటి అంశాలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, స్థానిక బిఎల్‌ఓ లు, బిఎల్‌ఏలు పాల్గొన్నారు.

# బాలికల పాఠశాలను సందర్శించిన ఆడిటర్



**ఏన్కూర్, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలను రాష్ట్ర విద్యా శాఖ నుండి ఏర్పాటుచేసిన సోషల్ ఆడిటర్ చైతన్యకుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల వసతులు, వంటగది, తరగతి గదులు, త్రాగునీటి తదితర సమస్యలపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మాని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిధుల వినియోగం ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు వరకు ఈ తనిఖీలు ప్రతి పాఠశాలలో జరుగుతాయని ఆయన తెలిపారు.పాఠశాలలో విద్యార్థుల శాతాన్ని మరింత పెంచాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పీ భూక్య లచ్చిరాం ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు చంద్రిక, నిర్మల, చైతన్య, సత్యవతి, లత, నాగమణి, సదా కోన్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ చేసిన అనిల్ కుమార్ ను సత్కరించిన ఆకుల గాంధీ

**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :**



భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఖమ్మం శాఖలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన అనిల్ కుమార్ ను లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ సమాఖ్య (ఎల్ఐఏఎఫ్ఐ) మాజీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఆకుల గాంధీ సత్కరించారు. ఎల్ఐసీ కార్యాలయంలోని ఎంప్లాయీస్ క్లబ్ రూంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆకుల గాంధీ మాట్లాడుతూ సంస్థ పురోభివృద్ధికి అనిల్ కుమార్ చేసిన కృషి,సేవలు మర్చిపోలేమని ఆయన తనకు సన్నిహిత మిత్రుడు,ఆత్మీయుడని అని అభినందిస్తూ శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ బాలాజీ నాయక్, లింగయ్య, వనిత, భద్రయ్య, రామలింగం, సురేష్, మధుసూదన్, హనుమంతరావు, శ్రీనివాసరావు, చక్రపాణి,వీరయ్య, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి




**నిజామాబాద్, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :**

మహిళలు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని,స్వయం ఉపాధి పొందాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు.మైనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని న్యాక్ భవనంలో కుట్టుమిషన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు.మైనార్టీ శాఖ ప్రత్యేకంగా శిక్షణ అందించి కుట్టు మిషన్లు అందించడం అభినందనీయమన్నారు.కేంద్ర ప్రభుత్వం కూడా కుట్టు మిషన్ లకు సంబంధించి పీఎం విశ్వకర్మ పథకం అందుబాటులోకి తీసుకువచ్చిందని గుర్తుచేశారు.ప్రస్తుతం మైనార్టీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 500 కుట్టు మిషన్ల ను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ,నూడా చైర్మన్ కేశ వేణు,బీజేపీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ మంథని 47వ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



**మంథని, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :**

లయన్స్ క్లబ్ ఆఫ్ మంథని 2026–27 సంవత్సరానికి సంబంధించిన 47వ నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం మంగళవారం మంథనిలోని ఎంఎంఆర్ బ్యాంకెట్ హాల్లో ఘనంగా నిర్వహించారు. జిల్లా మాజీ గవర్నర్ (పీడీజీ ) డాక్టర్ ఆర్. విజయ ఇన్స్టాలేషన్ ఆఫీసర్గా వ్యవహరించి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడిగా లయన్ మేడగోని వెంకటేష్, కార్యదర్శిగా లయన్ ముస్కుల లోకేందర్ రెడ్డి, కోశాధికారిగా లయన్ మందల మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పెంద్రు సుమంత్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు.కార్యక్రమానికి జిల్లా కేబినెట్ కార్యదర్శి లయన్ వొల్లాల కృష్ణహరి, జిల్లా కేబినెట్ ట్రెజరర్ లయన్ కొల్లూరి ఆనందం, రీజియన్ చైర్పర్సన్లు లయన్ రేకులపల్లి శశాంక, లయన్ కావేటి రాజగోపాల్, జోన్ చైర్పర్సన్లు లయన్ సదుల వెంకటేశ్వర్లు, లయన్ వెల్పుల రమేష్, లయన్ బెల్లంకొండ జైపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు అతిథులుగా హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మేడగోని వెంకటేష్ మాట్లాడుతూ.... సమాజ సేవకు ప్రాధాన్యం ఇస్తూ విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. సభ్యుల సహకారంతో క్లబ్ను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు

# మిరప నర్సరీలు నర్సరీ చట్టం ప్రకారం విత్తనాలు పెంచాలి

**ఖమ్మం, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :**







తెలంగాణ ప్రభుత్వం వారు కల్తీ నారుని అరికట్టి ఆరోగ్యకరమైన నారును రైతులకు అందుబాటులో తెచ్చేవిధంగా ఉద్యాన శాఖ ద్వారా నర్సరీ రిజిస్ట్రేషన్ చేయుటకు నర్సరీ క్రమబద్ధీకరణ 2017 ప్రకారం నియమ నిబంధనలు పాటించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి యం.వి. మధుసూధన్ పేర్కొన్నారు. మంగళవారం కామేపల్లి మండలంలోని ముచ్చర్ల గ్రామంలో నర్సరీ చట్టంపై అవగాహన సదస్సు లో పాల్గొని, వైరా డివిజన్ మిరప నర్సరీ యజమానులకు పలు సూచనలు చేశారు. నర్సరీ చట్టం 2017 ప్రకారం లైసెన్స్ లేకుండా నర్సరీలు నిర్వహించ కూడదు. ప్రభుత్వ ఆమోదం పొందిన కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. నర్సరీలలో పలు మేలైన యాజమాన్య పద్ధతులు, సూచనలు, నర్సరీ చట్టం ప్రకారం నియమ నిబంధనలు పాటించాలి. రైతుల అంగీకారం తెలిపిన రకాలను, పేరు గాంచిన రకాలను, వ్యవసాయ శాఖ ద్వారా ఆమోదం పొందిన రకాల నారు ను పెంచాలి.రైతుకు సంబంధించిన విత్తనాలు, విత్తిన వాటికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలి. నర్సరీ రిజిస్టర్లు (5 రిజిస్టర్లు) పూర్తి వివరాలతో మెయింటెన్ చేయాలి. నర్సరీ లైసెన్స్ నంబరు తో ముద్రించిన బిల్లు మాత్రమే కొనుగోలుదారుకు, రైతులకు ఇవ్వాలి. నర్సరీ లైసెన్స్ లేకుండా నర్సరీ నుండి మిరప, కూరగాయలు మొదలైన నారు అమ్మవద్దు, కొనవద్దు. న ర్సరీ నియమ నిబంధనలు పాటించని వారి పై నకిలీ విత్తనాలతో నారు పోసిన వారి పై రూ.50,000–/ (అక్షరాల యాభై వేల రూపాయలు మత్రమే) జరిమానా లేదా ఒక ఏడాది జైలు శిక్ష లేదా రెండు కూడా విధించి, నర్సరీ లైసెన్సును శాశ్వతంగా రద్దుపరిచి నర్సరీని మూసివేయబడును. ఈ సదస్సు లో వైరా డివిజన్ ఉద్యాన అధికారి డా. ఆకుల వేణు, ఉద్యాన విస్తర్ణ అధికారి సత్యేంద్ర కుమార్, నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతలు అభివృద్ధి పై చర్చకు రావాలి


**నేలకొండపల్లి, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :**



బీఆర్ఎస్ నేతలకు పాలేరు అభివృద్ధి కనిపించటం లేదని, బహిరంగ చర్చకు సిద్ధం కావాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొడాలి గోవింద రావు సవాల్ విసిరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అభివృద్ధిని చూసి తట్టుకోలేక మంత్రి శ్రీనివాసరెడ్డి పై అవాకులు, చెవాకులు పేలుతున్నారన్నారు. సొంత మండలం లోనే హద్దులు తెలియని నాయకులు మంత్రి పై విమర్శలు చేయటం సిగ్గుచేటు అన్నారు. పాలేరు లో కనివిని ఎరగని రీతిలో అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతుంటే జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ కనుమరుగు కావటం ఖాయమనీ పేర్కొన్నారు. వెన్నుపోటు రాజకీయాలు చేసింది ఎవరో ప్రజలకు తెలుసున్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాలేరు ఎప్పటికీ కాంగ్రెస్ కంచుకోట అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, రాయపూడి నవీన్, దోసపాటి శేఖర్, చిలకబత్తిని వీరబాబు, కైలాసపువెంకటేష్, కడియాల నరేష్, సర్పంచ్ లు కట్టెకోల నాగార్జున, కుక్కల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో విజయవంతంగా ముగిసిన పల్స్ పోలియో కార్యక్రమం

**ఖమ్మం, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :**



ఖమ్మం జిల్లాలో ఈ నెల జూన్ 28 నుండి 30 వరకు నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు.కార్యక్రమం తొలి రోజు అయిన జూన్ 28 (ఆదివారం) నిర్వహించిన పోలియో బూత్ లో పోలియో చుక్కలు వేయటం లో జిల్లాలోని 1,25,322 మంది 0–5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం లక్ష్యంగా ఉన్న 1,31,642 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.రెండవ , మూడవ రోజుల్లో నిర్వహించిన గృహ సందర్శన లో జిల్లావ్యాప్తంగా 3,50,774 ఇండ్లను ఆరోగ్య సిబ్బంది సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 298 ఇళ్లు ఎక్స్ మార్క్ ఇండ్లు, గా గుర్తించబడినట్లు పేర్కొన్నారు. ఈ ఇళ్లలో అందుబాటులో లేని చిన్నారులను యు ఐ పి లో భాగంగా ఆశా కార్యకర్తలు, ఏ ఎన్ ఎం లు తిరిగి సందర్శించి పోలియో చుక్కలు వేయడంతో పాటు, ఆయా ఎక్స్ మార్క్ లను పూర్తిగా తొలగించే చర్యలు చేపడతారని వెల్లడించారు.జిల్లాలో మొత్తం 1,31,642 మంది చిన్నారుల లక్ష్యానికి గాను 99.3 శాతం మేర పోలియో చుక్కలు వేయడం జరిగిందని, మిగిలిన అర్హులైన చిన్నారులను కూడా త్వరితగతిన గుర్తించి పోలియో చుక్కలు అందించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఏ ఎన్ ఎం లు , ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు, తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు సహకరించిన తల్లిదండ్రులందరికీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహించే యు. ఐ. పి. లో ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా పాల్గొని, పిల్లలకు నిర్దేశిత సమయానికి అన్ని టీకాలు వేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రఘునాథపాలెంలో ఆయిల్పామ్ మెగా ప్లాంటేషన్ ప్రారంభం

**ఖమ్మం, జూలై 01 (జర్నలిస్ట్ ఫైల్) :**



ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం లచ్చిరాంతండా గ్రామంలో 45 ఎకరాల్లో చేపట్టిన ఆయిల్పామ్ మెగా ప్లాంటేషన్ను జిల్లా ఉద్యానాధికారి ఎం.వి. మధుసూదన్ మొక్క నాటి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, మిరప వంటి సాంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్పామ్ సాగును చేపట్టాలని సూచించారు. ఆయిల్పామ్ పంటకు కోతుల బెడద, ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తక్కువగా ఉండటంతో పాటు, ఒకసారి నాటితే సుమారు 30 సంవత్సరాల పాటు ఆదాయం అందించే లాభదాయకమైన పంట అని తెలిపారు. ప్రభుత్వం ఆయిల్పామ్ సాగుకు ఎకరానికి రూ.51,000 వరకు రాయితీ అందిస్తోందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి నగేష్, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డి, గోద్రెజ్ ఫీల్డ్ ఆఫీసర్ చందు రైతులు పాల్గొన్నారు.

## ఎన్‌జీటీ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలి



- కమిషనర్ మయూర్ అశోక్
- ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై జిల్లా కమిటీ సమావేశంలో సూచనలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) నిర్దేశించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్--2026 మార్గదర్శకాలను అన్ని నగరాలు, పురపాలక సంస్థలు తప్పనిసరిగా అమలు చేయాలని గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ సూచించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎన్‌జీటీ గుంటూరు జిల్లా కమిటీ రెండో త్రైమాసిక సమావేశం కమిషనర్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్--2026 నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. ఘన వ్యర్థాలను మూలం వద్దే తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి సేకరించి శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెసింగ్ ప్లాంట్లలో శుద్ధి చేయడం అత్యంత ముఖ్యమన్నారు. అలాగే ద్రవ వ్యర్థాల శుద్ధి కోసం స్థానిక అవసరాలకు అనుగుణంగా మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీలు) ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో లెగసీ వ్యర్థాల నిర్మూలన పూర్తయిందని, ఇదే తరహాలో జిల్లాలోని మిగిలిన పురపాలక సంస్థల్లో కూడా లెగసీ వ్యర్థాలను పూర్తిగా తొలగించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు.

సమావేశంలో తెనాలి మున్సిపల్ కమిషనర్ జే. రామ అప్పలనాయుడు, మంగళగిరి మున్సిపల్ కమిషనర్ అలీం బాషా, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ఎం. రమేష్, పబ్లిక్ హెల్త్ ఈఈ సురేష్, నాగార్జున విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగాధిపతి భ్రమాజీ, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, పర్యావరణ ఇంజనీర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : పోతినేని శ్రీనివాసరావు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి పీఎంఏవై ఎన్టీఆర్ నగర్ టిడ్కో గృహ సముదాయంలో నిర్వహించిన "ఎన్టీఆర్ భరోసా పెన్షన్" పంపిణీ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నెలా ఎలాంటి ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులకు వారి ఇంటి వద్దకే పెన్షన్లు అందించే విధంగా ప్రభుత్వం సమర్థవంతమైన వ్యవస్థను అమలు చేస్తోందని తెలిపారు.

రాష్ట్ర ఐటీ, విద్య, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు సమానంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పోతినేని శ్రీనివాసరావు అన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపి అధ్యక్షులు అబ్దుల్ కరీమ్, నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు బుదాటి శ్రీనివాసరావు, పట్టణ తెలుగుమహిళ ప్రధాన కార్యదర్శి ఇండ్ల రజిని, గజ్జెల రమణ, పంది రామకృష్ణ, గంజి శివసుధ, కొల్లి శ్రీనివాసరావు, దివి జయశ్రీ, సల లీలావతి, కాకి మల్లికార్జునరావు, జంజనం యస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి మఠం మేనేజర్‌గా పిపిఎన్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** కడప జిల్లా బ్రహ్మంగారిమఠం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం మేనేజర్ గా జూన్ 30న ఈశ్వర చారి పదవి విరమణ చెందారు అనంతరం తదుపరి మేనేజర్ నియామకం కొరకు దేవాదాయ శాఖ మరియు మఠం కాంప్రమైజ్ డిక్రీలోని తొమ్మిదవ నిబంధన మేరకు మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారి ఉత్తర్వుల మేరకు బుధవారం ఉదయం ఆలయ అర్చకుల వేదమంత్రాల ఆశీర్వచనంతో మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించారు. భవిష్యత్తులో మఠం అభివృద్ధి కోసం భక్తుల సౌకర్యాలు మెరుగుపరచడం కోసం మఠాధిపతి శ్రేయస్సు కోసం పూర్తి అధికారాలు వినియోగిస్తారని బాధ్యతలు నిర్వర్తిస్తానని మీడియాకు తెలిపారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం ప్రసాద్ కి పలువురు బంధుమిత్రులు స్నేహితులు శ్రేయోభిలాషులు కలిసి దుశాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు.

# వైసీపీ నాయకులకు సంక్షేమానికి అర్థం తెలుసా?

- కుంటి సాకులతో పింఛన్లు తీసేయడమేనా సంక్షేమం ?
- అమ్మ ఒడి పేరిట విద్యార్థులను దగా చేయడమేనా సంక్షేమం ?
- కూటమి రెండేళ్ల పాలనలో రూ.66 వేల కోట్ల విలువైన పెన్షన్లు అందించాం
- ఎన్నడూ లేని విధంగా పింఛన్ల నగదు పెంచాం
- సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం
- ఇదీ సంక్షేమం అంటే తెలుసుకోండి
- ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** పేదలకు అందాల్సిన పథకాలకు కోతల పెట్టిన వైసీపీకి సంక్షేమం అంటే అర్థం తెలుసా అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ, మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ ప్రశ్నించారు. బుధవారం స్థానిక 12 13 వ వార్డుల్లో నిలాలాపేట, సంగడిగుంట ప్రాంతాల్లో సచివాలయ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే నసీర్ స్వయంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పింఛన్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తోన్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలోనే 66 వేల కోట్ల రూపాయల విలువైన పెన్షన్లు అందించినట్లు తెలిపారు. ఈ నెలలో నూతనంగా గుంటూరు నగరంలో 47 పెన్షన్లు మంజూరు చేశామన్నారు. సూపర్ సిక్స్‌లు సూపర్ హిట్‌గా అమలు పరిచామని తెలిపారు. కనీసం ప్రజలలో అడుగు పెట్టడానికి కూడా ధైర్యం లేని వైసీపీ నేతలు మీడియా ముందు మాత్రం పిచ్చి ప్రేలాపనలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై మాట్లాడటం కూడా చేతకాదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు మేమున్నామనే భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. గత వైసీపీ పాలనలో అమ్మ ఒడి పేరిట చదువుకునే పిల్లల్లో కేవలం ఇంట్లో ఒక్కరిని మాత్రమే అర్హులుగా గుర్తించి మిగిలిన వారికి మొండి చేయి చూపించారన్నారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులు చదువుకుంటే అందరికీ తల్లికి వందనం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఒకటో తేదీ వచ్చిందంటే పింఛన్ల పండుగేనని తెలిపారు. ఏపీలో మొదటి నుంచి పింఛన్ల పెంచిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ పెంచామని, ఇది తమ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు.

## జాతీయ రహదారి, ప్రధాన రోడ్లపై పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ సాయికాంత్ వర్మ
- అవసరమైతే మూడు షిఫ్టుల్లో పారిశుధ్య పనులు.. రెండు రోజుల్లో జంక్షన్ల అభివృద్ధి టెండర్లు పిలవాలని ఆదేశం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగర పరిధిలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్లు, ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద మెరుగైన పారిశుధ్యాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్, గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. అవసరమైతే మూడు షిఫ్టుల్లో పారిశుధ్య పనులు చేపట్టి నగరంలో పరిశుభ్రత స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం కాకాని రోడ్డు వై జంక్షన్ నుంచి చిలకలూరిపేట వై జంక్షన్ వరకు జాతీయ రహదారి సర్వీస్ రోడ్, నగరంలోని ప్రధాన కూడళ్లను నగర కమిషనర్ కె. మయూర్ అశోక్‌తో కలిసి పరిశీలించిన అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా నగరంలోని ప్రధాన జంక్షన్లు, రహదారుల అభివృద్ధి ప్రతిపాదనలను పరిశీలించిన కలెక్టర్, ట్రాఫిక్‌కు అనుకూలంగా టేబుల్‌టాప్‌లు, హైమాస్ట్ లైట్లు, ట్రాఫిక్ సిగ్నళ్లు, ఫౌంటెన్లు శాస్త్రీయంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జంక్షన్లు, మీడియన్లు, రహదారుల వద్ద విద్యుత్ దీపాలు ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పూర్తైన తర్వాత హోర్డింగులు, కేబుళ్లు లేకుండా పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అభివృద్ధి చేపట్టనున్న జంక్షన్లలో ట్రాఫిక్ పోలీసులతో కలిసి ట్రయల్ రన్ నిర్వహించి, రెండు రోజుల్లో టెండర్లు పిలవాలని ఆదేశించారు.

నగరంలో ఎండ్ టు ఎండ్ క్లీనింగ్ నిర్వహించి అవసరమైతే అదనపు పారిశుధ్య కార్మికులను నియమించాలని కలెక్టర్ తెలిపారు. ఈ నెలాఖరు నాటికి నగరంలో సుమారు 80 వేల మొక్కలు నాటే లక్ష్యంతో, ముఖ్యంగా ఎవెన్యూ ప్లాంటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న పార్కులతో పాటు కొత్త పార్కుల అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో నగరపాలక సంస్థ విభాగాధిపతులు, ట్రాఫిక్ పోలీసులు, ఏపీయూఐఏఎంఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుంటూరులో ఆర్థోపెడిక్ వికలాంగుల ఎంపిక



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మోకాలి పైభాగం వరకు అవయవాలు కోల్పోయిన ఆర్థోపెడిక్ వికలాంగుల ఎంపిక కార్యక్రమం గురువారం గుంటూరులో ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతుందని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఎన్. వెంకటరవణప్ప తెలిపారు. ఉదయం 10 గంటల నుండి ఎంపిక జరుగుతుందని చెప్పారు. అర్హత, అవసరం ఉన్న దివ్యాంగులు సదరం వైద్య ధృవీకరణ పత్రము, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రము, ఆధార్ కార్డు, యు.డి.ఐ.డి కార్డు ప్రతులు, రెండు ఫోటోలు, ఫోన్ నెంబర్ వివరాలతో హాజరు కావచ్చని చెప్పారు. వివరాలకు ఫోన్ నెంబరు: 0863-2323329 సంప్రదించవచ్చని వివరించారు.

**కృత్రిమ అవయవాలకు 6 మంది దివ్యాంగులు ఎంపిక :** కృత్రిమ అవయవాలు, కాలిపర్స్ (Artificial Limbs & Calipers) పంపిణీకి ఎంపిక చేయుటకు బుధవారం తాడికొండలో నిర్వహించిన ఎంపిక శిబిరంలో ఆరు గురు దివ్యాంగులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. మోకాలి పైభాగం వరకు అవయవాలు కోల్పోయిన ఆర్థోపెడిక్ వికలాంగులకు మాత్రమే కృత్రిమ అవయవాలు, కాలిపర్స్ (గాతీఅటఅఎఖుశ్రీ ాఅఎం ఉ ఖుశ్రీఅజూవతీం) పంపిణీకి ఎంపిక చేయుటకు చేపట్టిన కార్యక్రమం అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలింకో సంస్థ సహకారంతో జిల్లాలోని అర్హత, అవసరం ఉన్న దివ్యాంగుల ఎంపిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి, అలింకో ప్రతినిధులు పాల్గొన్నారు.

# బోయపాలెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- రెండు లారీలు ఢీకొని మంటలు.. ముగ్గురు లేదా నలుగురు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్.. సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశాలు





**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయపాలెం గ్రామం సమీపంలో జాతీయ రహదారి-16పై బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు లేదా నలుగురు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం అందింది. చిలకలూరిపేట వైపు నుంచి గుంటూరు దిశగా వస్తున్న ఓ లారీ ఉదయం సుమారు 5.45 గంటలకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న మరో లారీని బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వెంటనే రెండు లారీలకు మంటలు వ్యాపించి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో లారీల్లో ఉన్న వ్యక్తులు మంటల్లో చిక్కుకున్నారు.

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, అగ్నిమాపక సిబ్బంది, హైవే అంబులెన్స్ సిబ్బంది, స్థానిక పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే హైవేపై రాకపోకలకు అంతరాయం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను సమగ్రంగా దర్యాప్తు చేసి వెలికితీస్తామని ఎస్పీ తెలిపారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని గుర్తింపు ప్రక్రియ చేపట్టడంతో పాటు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనాలను మళ్లిస్తూ, రహదారిని త్వరితగతిన సాధారణ రాకపోకలకు అనుకూలంగా మార్చేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, అలసటతో లేదా నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ఘటనాస్థల పరిశీలనలో ఎస్‌బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు, ఎస్సై నరహరి, హైవే పెట్రోలింగ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 21 వేల మందికి రూ.9 కోట్లకు పైగా పెన్షన్లు

- సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 45వ డివిజన్ గౌతమీ నగర్‌లో బుధవారం నిర్వహించిన "పేదల సేవలో" కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణలు ఎన్టీఆర్ సామాజిక భద్రతా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై స్పందనలు సేకరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ప్రతి నెలా ఒకటో తేదీ కోసం వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, మంచానికే పరిమితమైన లబ్ధిదారులు ఎంతో ఆశగా ఎదురుచూస్తారని తెలిపారు. అలాంటి వారికి ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పెన్షన్లు నిజమైన ఆపన్నహస్తంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

గౌతమీ నగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రతి అ-ర్హత కలిగిన లబ్ధిదారునికి పెన్షన్ అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా భాగస్వాములై సహకారం అందిస్తున్నారని చెప్పారు.

ఈ సందర్భంగా గౌతమీ నగర్‌కు చెందిన ఇద్దరు మహిళలకు కొత్తగా వితంతు పెన్షన్లు మంజూరు చేసినట్లు గళ్ళా మాధవి వెల్లడించారు. భర్తలు మరణించిన అనంతరం వారు అందుకుంటున్న పెన్షన్లను భార్యల పేర్లపై కొనసాగిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోనే ఈ నెల 19 మందికి కొత్త వితంతు పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు.

పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి నెలా 21 వేల మందికి పైగా లబ్ధిదారులకు రూ. 9 కోట్లకు పైగా వ్యయంతో సామాజిక భద్రతా పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. గతంలో రూ. 2 వేలుగా ఉన్న పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంచడంతో పాటు, మంచానికే పరిమితమైన బాధితులకు రూ. 15 వేల వరకు పెన్షన్ అందజేస్తూ వారి జీవితాల్లో భరోసా నింపుతున్న ప్రభుత్వం ముఖ్యమంత్రి నాయకత్వంలో సంక్షేమ పాలన అందిస్తోందని గళ్ళా మాధవి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ పాల్గొనడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులతో కలిసి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ సంక్షేమం, అభివృద్ధి అనే రెండు లక్ష్యాలతో ముందుకు సాగుతోందని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

## ఇంటి వద్దకే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేస్తున్న ప్రభుత్వం : పిల్లి మాణిక్యరావు



- పలకలూరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా టీడీపీ అధ్యక్షుడు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు బుధవారం ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పలకలూరులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నెల ఒకటో తేదీన అర్హులైన లబ్ధిదారుల ఇంటి వద్దకే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే పింఛన్లు అందించడం ద్వారా ప్రభుత్వం ఆదర్శవంతమైన సేవలు అందిస్తోందన్నారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పతకమూరి సుబ్రహ్మణ్యం, దొడ్డా సుధాకర్, తాతిరెడ్డి లక్ష్మారెడ్డి, పతకమూరి కోటేశ్వరరావు, అహ్మద్, పొన్నగంటి శ్రీనివాసరావు, ఏరువా సాంబిరెడ్డి, షేక్ జానీ బాషా, షేక్ ఖాసీం, మట్టుపల్లి దాసు తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలను ఆదుకుంటున్న సీఎం సహాయ నిధి : చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** సీఎం సహాయనిధి పేదల పాలిటి పెన్నిధని ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 74 మంది లబ్ధిదారులకు, 63 లక్షలు 54 వేలు రూపాయల చెక్కులను బుధవారం తన కార్యాలయంలో చీఫ్ విప్ జీవీ పంపిణీ చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు నాయుడు అందించిన నిధులు, తమకు అందేలా కృషిచేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీకి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కేవీ అండర్- 17 జోనల్ స్పోర్ట్స్ వాలీబాల్ విజేత సత్తెనపల్లి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి కేంద్రియ విద్యాలయాల వాలీబాల్ అండర్-17 జోనల్ స్పోర్ట్స్ ముగిశాయి. పోటీలలో ఏపీ, తెలంగాణ రీజియన్ నుంచి బాలుర విభాగంలో 14 జట్లు పాల్గొని తమ సత్తా చాటాయి. వాలీబాల్ బాలుర విభాగంలో సత్తెనపల్లి విజేతగా నిలవగా, ద్వితీయ స్థానంలో విజయవాడ - 1, తృతీయ స్థానంలో తెనాలి విద్యాలయ నిలిచింది. ఈ పోటీలు పోటీలు గత నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించగ ఈపోటీలను తెనాలి కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపాల్ జీఆర్ మీనా ప్రారంభి, విద్యార్థులను అభినందించారు. సికింద్రాబాద్ కేంద్రియ విద్యాలయలో నిర్వహించిన అండర్- 14 బాలబాలికల వాలీబాల్ పోటీలలో తెనాలి బాలుర జట్టు ప్రథమస్థానం, బాలిక జట్టు తృతీయస్థానం సాధించారు. గోల్కొండ (హైదరాబాద్)లో నిర్వహించిన పోటీలలో వంద మీటర్లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, వంద మీటర్ల హర్డిల్స్, 400 మీటర్ల హర్డిల్స్, 500 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం, రజితం, కాంస్య పతకాలు సాధించారు. క్రీడాకారులకు ప్రిన్సిపాల్ జీఆర్ మీనా, ఫిజికల్ డైరెక్టర్ బి. రవికుమార్, కోచ్ డి. అజయ్‌కుమార్ సర్టిఫికెట్లు, పతకాలు అందించి, అభినందించారు.

## కాకుమానులో సహకార వారోత్సవాలు



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** కాకుమాను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి లి ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలు చైర్ పర్సన్ నల్లమోతు వీర శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాకుమాను పి ఏ సి ఎస్ నందు ప్రజలకు ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిభిరం లో ప్రజలకు షుగర్, బి పి, మరియు ఇతర ఆరోగ్య సమస్యలను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకుమాను సొసైటీ చైర్ పర్సన్ నల్లమోతు వీర శంకర రావు, జి డి సీసీ బ్యాంకు మేనేజర్ నాగేంద్ర బాబు, మండలం ఇంచార్జ్ నాగుర్ బి పి ఏ సి ఎస్ సిబ్బంది శేష సాయి, బాషా, సాయి, రాధ, కరీముల్లా, వైద్య సిబ్బంది వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఇంటింటికీ పెన్షన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ ):** తెనాలి మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామం, తెనాలి పట్టణంలోని 30వ వార్డులో బుధవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లను అందజేశారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది సమన్వయంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర అర్హులైన వారికి ప్రభుత్వం నిర్ణయించిన మేరకు పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీ ప్రక్రియను ఎలాంటి అంతరాయం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

పెన్షన్ అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రతి నెలా అందుతున్న ఆర్థిక సాయం తమ నిత్యావసరాలకు ఎంతో తోడ్పడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణా డెల్టాకు సాగునీటి విడుదల



- **13.08 లక్షల ఎకరాలకు నీరు.. 30 లక్షల మంది రైతులకు ప్రయోజనం**
- **కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్ ):**కృష్ణా డెల్టా రైతులకు సకాలంలో సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రకాశం బ్యారేజ్‌లోని కృష్ణా ఈస్ట్రన్ మెయిన్ హెడ్ రెగ్యులేటర్ నుంచి బుధవారం తూర్పు, పశ్చిమ కాలువలకు 3,200 క్యూసెక్కుల నీటిని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన 'ఏరువాక పౌర్ణమి' కార్యక్రమానికి కొనసాగింపుగా నీటి విడుదల చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కృష్ణా డెల్టా పరిధిలోని 13.08 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడం ద్వారా దాదాపు 30 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన 'జలాధార--జలహారతి' కార్యక్రమంలో భాగంగా కాలువల మరమ్మతులు, పూడికతీత పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. భూగర్భ జలాల రీఛార్జ్‌కు కూడా ప్రాధాన్యం ఇస్తూ రైతులకు నీటి కొరత లేకుండా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు మాట్లాడుతూ, నీటి క్యాలెండర్ ప్రకారం జూలై 1నే సాగునీరు విడుదల చేయడం రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. జూలై చివరి నాటికి వరి నాట్లు పూర్తి చేస్తే తుఫానుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు.

కృష్ణా డెల్టా కాలువల పూడికతీత, కట్టల బలోపేతానికి రూ. 64 కోట్లు ఖర్చు చేశామని, అవసరమైతే పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించి నీటి కొరత లేకుండా చూస్తామని చెప్పారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నీటిని పొదుపుగా వినియోగించి అందుబాటులో ఉన్న నీటి మేరకు పంటల సాగు చేపట్టాలని రైతులకు సూచించారు.

## అమరావతిని ఎవరూ అడ్డుకోలేరు

- **జగన్ వ్యాఖ్యలు రాష్ట్రంలో అనిశ్చితి సృష్టించే ప్రయత్నమే**
- **బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** అమరావతి రాజధాని నిర్మాణాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని, ఇకపై కూడా అడ్డుకోలేదని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి రాజధానిపై చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించి రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలనే రాజకీయ ప్రయత్నమే తప్ప, ప్రజా ప్రయోజనం ఇందులో లేదన్నారు.

అమరావతిని రాజధానిగా గుర్తించే ప్రక్రియలు ఇప్పటికే రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా పూర్తయ్యాయని, కేంద్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి పూర్తి మద్దతు ప్రకటించి అవసరమైన సహకారం అందిస్తోందని తెలిపారు. దేశీయ, విదేశీ పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్న సమయంలో అమరావతిపై వివాదాలు సృష్టించే వ్యాఖ్యలు పెట్టుబడులను నిరుత్సాహపరిచేలా ఉన్నాయని అన్నారు. అమరావతి ఐదు కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవానికి, రాష్ట్ర అభివృద్ధి సంకల్పానికి ప్రతీక అని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో అమరావతి నిర్మాణం వేగంగా ముందుకు సాగుతోందని జయప్రకాశ్ నారాయణ తెలిపారు. రాష్ట్రానికి ప్రస్తుతం అవసరమైనది వివాదాలు కాదని, అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలేనని పేర్కొన్నారు.

అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం పూర్తి, పారిశ్రామికాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన, వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు బీజేపీ పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## రైతుల కోసం కాదు... రాజకీయాల కోసమే జగన్ విమర్శలు

- **ముందు ఐదేళ్ల పాలనపై సమాధానం చెప్పాలి: జగన్‌కు అచ్చెన్న సవాల్**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత ఐదేళ్ల పాలనలో రైతులను పూర్తిగా విస్మరించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు రైతులపై మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు రైతుల సమస్యలను పట్టించుకోని జగన్, ఇప్పుడు ప్రెస్‌మీట్లతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల సంక్షేమంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే తన పాలనలో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించిన ఆయన, రాష్ట్రాన్ని వ్యవసాయ సంక్షోభంలోకి నెట్టిన వారే ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరమన్నారు. రైతు సమస్యలపై బహిరంగ చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు.

పొగాకు ధరల నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదని, కేంద్రంలోని పొగాకు బోర్డు, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితుల ఆధారంగానే ధరలు నిర్ణయించబడతాయని మంత్రి వివరించారు. వైసీపీ ప్రభుత్వం ఒకసారి మాత్రమే పొగాకు కొనుగోలు చేసి రైతులను విస్మరించగా, కూటమి ప్రభుత్వం రూ. 273 కోట్లతో హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. ఈ-పంట నమోదులోనూ కూటమి ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించిందని, ఖరీఫ్-2025లో 53.32 లక్షల మంది రైతుల 117.39 లక్షల ఎకరాలను నమోదు చేసి, రబీ సీజన్‌లో 99.7 శాతం నమోదు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంట బీమా, అన్నదాత సుఖీభవ వంటి అంశాల్లోనూ రైతులకు సకాలంలో ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. తోతాపురి మామిడి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గత ఏడాది 4.70 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలు చేసి రూ. 190 కోట్ల సాయం అందించామని, ఈ ఏడాది కూడా కిలోకు రూ. 4 చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టామని, జూన్ 8 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా 3.88 లక్షల మంది రైతులకు 17.25 లక్షల ఎరువుల బస్తాలు పంపిణీ చేశామని వెల్లడించారు. కౌలు రైతులకు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుతున్నాయని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో రైతు వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిందని, డ్రిప్ ఇరిగేషన్, పంట బీమా, నేచురల్ ఫార్మింగ్ వంటి కీలక రంగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి ఆరోపించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిలు చెల్లించి వ్యవస్థలను గాడిన పెట్టిందని, డ్రిప్ ఇరిగేషన్‌లో రాష్ట్రం వరుసగా రెండేళ్లు దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఫలించవని, తన పాలనలో జరిగిన వైఫల్యాలపై ముందు జగన్ సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.

## ఎస్ఆర్ఎం ప్రొఫెసర్లకు కేంద్ర పరిశోధక ప్రాజెక్టులు

- **మొత్తం 24 మందికి రూ.13.71 కోట్లు మంజూరు**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):**వివిధ రంగాల్లో నూతన పరిశోధనలపై ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్లు దృష్టి సారించారు. దేశ రక్షణ, మానవ ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు పరిశోధనల్లో వీరు తమ ప్రతిభను చూపుతున్నారు. వీరి పరిశోధనా పటిమను గుర్తించిన పలు కేంద్ర ప్రభుత్వ పరిశోధనా రంగ సంస్థలు మొత్తం 24 మంది ఎస్ ఆర్ ఎం ప్రొఫెసర్లకు ఈ ఏడాది రూ. 13.71 కోట్ల విలువైన పరిశోధక ప్రాజెక్టులను మంజూరు చేశాయి. జనవరి నుంచి ఇప్పటి వరకూ అందిన రీసెర్చ్ ప్రతిపాదలను పరిశీలించిన కేంద్ర పరిశోధనా రంగ సంస్థలు వచ్చే రెండేళ్ల వ్యవధిలో రీసెర్చ్ ను పూర్తి చేసి నివేదికను అందజేయాలని ప్రొఫెసర్లకు సూచించాయి.

ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ సుదర్శన్ గోవిందరాజన్, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ పవన్కుమార్, డాక్టర్ బరున్కుమార్ బర్మన్, డాక్టర్ ఉత్తమ్కుమార్, డాక్టర్ మంగళంపల్లి కిరణ్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ సుజిత్ కల్లూరి, డాక్టర్ సీమారాణి, డాక్టర్ కోరుపల్లి చిరంజీవి, డాక్టర్ యంగళరావు, డాక్టర్ ప్రతీక్ గుప్తాతో పాటు డాక్టర్ సుదేష్ణ, డాక్టర్ కౌశిక్ సహ, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ వెంకట రమేష్. డాక్టర్ దేబజ్యోతి కుందు, డాక్టర్ రంగభాష్యం, డాక్టర్ మనాబ్ కుందు, డాక్టర్ రామ్ బరా వర్మ, డాక్టర్ కమలేష్ సహ, డాక్టర్ సురేందర్ కౌర్, డాక్టర్ సోని వాద్వాలు కేంద్ర పరిశోధక ప్రాజెక్టులు అందుకున్న వారిలో ఉన్నారు. వీరందరికీ పరిశోధనల నిమిత్తమ్ కేంద్రం రూ. 13.71 కోట్లను మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా భావించే అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్), డీఆర్డీవో, ఐసీఎంఆర్, డీఎస్టీ, డీబీటీ వంటి కేంద్ర సంస్థలు ఈ గ్రాంట్లను విడుదల చేశాయి. రాష్ట్రంలోని ఒకే యూనివర్సిటీకి ఈ స్థాయిలో పరిశోధక ప్రాజెక్టులు మంజూరు కావడం విశేషం.

**ప్రొఫెసర్లకు ప్రత్యేక ప్రశంసలు....**

యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా, రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూరిలు గ్రాంట్లు అందుకున్న ప్రొఫెసర్లను ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం రాత్రి హాయ్ ల్యాండ్‌లో వీరందరికీ ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేసి వారి పరిశోధనా రంగ కృషిని ప్రశంసించారు. పరిశోధనలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మెటీరియల్ కొనుగోలు విషయంలో పూర్తిగా సహకారం అందిస్తామని వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీన్లు డాక్టర్ సీవీ టామి, డాక్టర్ విష్ణుపథ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ అమలులో ఉద్యోగుల హక్కులు కాపాడాలి





- **కేడర్ వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచాలి**
- **సీనియారిటీ జాబితాలు బహిరంగపరచాలి**
- **శాఖల వారీగా సమావేశాలు నిర్వహించాలి**
- **ఏపీ ఎన్జీజీవో సంఘం విజ్ఞప్తి**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్‌కు అనుగుణంగా చేపడుతున్న జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో అమలు చేసి, ఉద్యోగుల హక్కులు, సేవా ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ కోరింది. ఈ మేరకు బుధవారం గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించారు. జేఏసీ సభ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఎ. శ్యాంసుందర్ శ్రీనివాస్ ఉద్యోగుల తరఫున సమగ్ర నివేదికను సమర్పించారు.

సమావేశంలో జిల్లాలోని అన్ని శాఖల్లో కేడర్‌వారీ తుది సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసి జిల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని, కేడర్ బలం, ఖాళీ పోస్టుల వివరాలను కూడా బహిరంగంగా ప్రకటించాలని ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ కోరింది. అలాగే ప్రతి శాఖలో ఉద్యోగ సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి శాఖల వారీ సమస్యలను వినిపించే అవకాశం కల్పిస్తే వాటి పరిష్కారం సులభతరం అవుతుందని సూచించింది.

ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ ప్రకారం జూనియర్ అసిస్టెంట్ పోస్టు జిల్లా కేడర్‌కు, సీనియర్ అసిస్టెంట్ పోస్టు జోనల్ కేడర్‌కు చెందినదని పేర్కొంటూ, ఈ రెండు కేడర్ల మధ్య ఉన్న మరో నాలుగు కేడర్లపై ప్రతిపాదనల్లో స్పష్టత లేదని అసోసియేషన్ అభిప్రాయపడింది. ప్రస్తుతం జిల్లా కేడర్ పరిధిలో ఉన్న ఆ కేడర్లను యథాతథంగా కొనసాగించాలని కోరింది. అలాగే గత నెల 19న నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఉద్యోగ సంఘాలకు అందజేసినందుకు జిల్లా రెవెన్యూ అధికారికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్‌కు అనుగుణంగా సాగాలని, ఉద్యోగుల హక్కులు, న్యాయమైన ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : ఎమ్మెల్సీ ఆలపాటి



- **18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని పిలుపు**

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** 18 సంవత్సరాలు పూర్తి చేసిన ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు కావాలని ఎమ్మెల్సీ, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. తెనాలిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పట్టణం, నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై పార్టీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జీలకు పలు సూచనలు చేశారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ద్వారా కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణ, నకిలీ నమోదుల తొలగింపు వంటి ప్రక్రియలు చేపడతారని తెలిపారు. అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఓటరుగా నమోదు కావాలని, అవసరమైన చోట వివరాలను సరిదిద్దుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, వయస్సు, నివాస ధ్రువీకరణ పత్రాలు తదితర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురించిన తర్వాత ప్రజలు అభ్యంతరాలు, సవరణల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని, అన్ని అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది ఓటరు జాబితా విడుదల చేస్తారని ఆలపాటి వివరించారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు మహమ్మద్ కుద్దూస్, అశోకవర్ధన్, జొన్నల మహేష్, కేసన కోటేశ్వరరావు, విజయ్‌కుమార్, కుదరవల్లి శ్రీనివాస్, మధు కోనేరు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు





**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్) :** కొల్లూరు మండలం పెసర్లంక గ్రామంలో బుధవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొని అర్హులైన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందజేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందన్నారు. ప్రతి నెలా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటోందని, ప్రతి అర్హ కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

### ఒడిశా గవర్నర్ హరిబాబుకు 'భారత్ రైజింగ్ ఇన్ ది మోదీ ఎరా' పుస్తకం బహూకరించిన కిలారు దిలీప్



**కృష్ణా జిల్లా,(జర్నలిస్ట్ ఫైల్ ):**భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి, రచయిత కిలారు దిలీప్ రచించిన "భారత్ రైజింగ్ ఇన్ ది మోదీ ఎరా" పుస్తకాన్ని కంభంపాటి హరిబాబుకు బహుకరించారు. కృష్ణా జిల్లా కనుమూరులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్‌కు మర్యాదపూర్వకంగా పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పుస్తకంలోని ప్రధాన అంశాలను కిలారు దిలీప్ గవర్నర్‌కు వివరించారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో చోటుచేసుకున్న అభివృద్ధి, సుపరిపాలన, మౌలిక వసతుల విస్తరణ, డిజిటల్ పరివర్తన, ఆర్థిక సంస్కరణలు, ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠ పెరుగుదల వంటి అంశాలను సమగ్రంగా పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు.

పుస్తకాన్ని పరిశీలించిన గవర్నర్ హరిబాబు, సమకాలీన జాతీయ అంశాలను వాస్తవాధారాలతో ప్రజలకు అందించే ప్రయత్నాన్ని అభినందించారు. దేశ అభివృద్ధి ప్రస్థానాన్ని ప్రజలకు చేరవేసే ఇటువంటి రచనలు సమాజానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కిలారు దిలీప్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం సాధించిన ప్రగతిని ఆధారాలతో పాఠకులకు అందించాలనే లక్ష్యంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు వంటి సీనియర్ నాయకుడికి తన పుస్తకాన్ని అందజేసి అభినందనలు పొందడం సంతోషంగా ఉందని చెప్పారు.

## రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 అమలులో ఉద్యోగుల హక్కులకు రక్షణ కల్పించాలి

- **పెండింగ్ ప్యానెల్స్ పూర్తి చేసిన తర్వాతే అమలు చేయాలి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ విజ్ఞప్తి**
- **సీసీఎల్ఏ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సమావేశంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ విజ్ఞప్తి**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 అమలులో ఉద్యోగుల హక్కులు, సీనియారిటీ, పదోన్నతులు, సేవా ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కోరింది. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుపై ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు సీసీఎల్ఏ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో బుధవారం ఏపీఐఐసీ భవనంలోని సీసీఎల్ఏ కార్యాలయంలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్‌తో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొని పలు సూచనలు సమర్పించారు.

రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుకు ముందుగా రెవెన్యూ శాఖలో 2018-19 నుంచి 2025-26 వరకు పెండింగ్‌లో ఉన్న డిప్యూటీ తహసీల్దార్ ప్యానెల్స్‌ను పూర్తి చేసి సమగ్ర సీనియారిటీ జాబితా రూపొందించాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. స్థానిక కేడర్ల పునర్వ్యవస్థీకరణ కారణంగా ప్యానెల్స్‌ను నవీకరించేందుకు ప్రభుత్వం తగిన సమయం ఇవ్వాలని కోరింది. అలాగే సీనియారిటీ, పదోన్నతులు, వేతనాలు, వార్షిక ఇంక్రిమెంట్లు, పెన్షన్ వంటి సేవా హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న సీనియారిటీని సాధ్యమైనంత వరకు కొనసాగించాలని సూచించింది.

ఉద్యోగుల అభీష్టాలకు ప్రాధాన్యం ఇస్తూ పోస్టింగ్‌లు పారదర్శకంగా నిర్వహించాలని, భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే ఒకే ప్రాంతంలో విధులు కల్పించేలా చూడాలని అసోసియేషన్ ప్రతిపాదించింది. వికలాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులు, వితంతువులు వంటి ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న వారికి మానవతా దృక్పథంతో ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని కోరింది. డ్రాఫ్ట్ సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు తెలిపేందుకు కనీసం 15 నుంచి 30 రోజుల గడువు ఇవ్వాలని, అప్పీలు పరిష్కరించిన తర్వాతే తుది కేటాయింపులు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. శాఖల వారీగా దశలవారీ అమలు చేపట్టాలని, ఖాళీ పోస్టులు, కేడర్ బలం, సీనియారిటీ జాబితాలు, కేటాయింపు ప్రమాణాలను ముందుగానే బహిరంగపరచాలని సూచించింది.

అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-1లోకి, పోలవరం జిల్లాను జోన్-2లోకి చేర్చాలని కూడా అసోసియేషన్ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ నిష్పత్తిని రాజ్యాంగబద్ధంగా పరిరక్షించాలని కోరింది. ఈ అంశాలపై సీసీఎల్ఏ సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగుల ప్రయోజనాలకు భంగం కలగకుండా రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 అమలుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపిస్తామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ వెల్లడించింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467